తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
శనివారం
12 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :

# సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

## కలెక్టర్ అంకిత్

○పాత రికార్డులు, మ్యాపుల ఆధారంగా భూ సరిహద్దుల కచ్చితమైన నిర్ధారణ..
○సీఎస్ఆర్ నిధులతో రహదారి నిర్మాణానికి చర్యలు..





**అశ్వాపురం సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**
భూ రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి భూ సరిహద్దులను కచ్చితంగా నిర్ధారిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్, ట్యాబ్ పరికరాలతో చేపడుతున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. డిజిటల్ విధానంలో సర్వే నిర్వహించడం వల్ల సమయం, సిబ్బంది ఆదా కావడంతో పాటు ట్యాబ్‌లో నమోదైన సమాచారాన్ని నేరుగా కంప్యూటర్, ఆటోక్యాడ్‌లోకి మార్చుకునే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అమ్మగారిపల్లి, కుమ్మగూడెం పరిధిలో కాడస్ట్రల్ మ్యాపులు, పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సుమారు 1,900 ఎకరాలకు పైగా భూముల సరిహద్దులను నిర్ధారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 1920ల నాటి ఫసలీ రికార్డులతో పాటు బూర్గంపాడు తాలూకాకు సంబంధించిన పాత రికార్డులను పరిశీలిస్తున్నట్లు వివరించారు. మూడు తరాలుగా భూములను అనుభవిస్తున్నప్పటికీ రికార్డుల్లో ఉపవిభజనలు నమోదు కాకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గోదావరి వరదలు, భూమి కోతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పాత భూ సరిహద్దులు మారిపోయాయని, సీతారామ ప్రాజెక్టు పరిసరాల్లో కొన్ని చోట్ల సుమారు 250 మీటర్ల మేర మార్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు వివరించారు. 57/1 తదితర సర్వే నంబర్లలో నీట మునక, ఇసుక మేటల కారణంగా పాత భూ గుర్తులు కనుమరుగైనట్లు తెలిపారు. కేఎంఎల్ ఫైళ్ల ఆధారంగా సుమారు 7.91 కిలోమీటర్ల మేర సరిహద్దులను గుర్తిస్తున్నామని, రోజుకు సుమారు 2 కిలోమీటర్ల చొప్పున సర్వే నిర్వహించి 2 నుంచి 4 రోజుల్లో పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పాత రికార్డులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు భూములపై స్పష్టత కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ప్రాంతంలో రహదారి నిర్మించాలని కలెక్టర్‌ను కోరగా, అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో అవసరమైన మేరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, సర్వే అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

# విభాగం ఎన్నికలు : కలెక్టర్

○ఎన్నికల ప్రత్యేక అధికారిణిగా సీ.పీ.ఓ సునీత నియామకం
○ఈ నెల 24వ తేదీన నామినేషన్లు స్వీకరణ, 26వ తేదీన తుది జాబితా ప్రకటన,వచ్చే నెల అక్టోబర్ 4వ తేదీన ఎన్నికలు

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్11 (జనంసాక్షి)**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ. ఆర్.సీ.ఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విభాగం ఎన్నికలు వచ్చే నెల అక్టోబరు 4వ తేదీ ఆదివారం నిర్వహిస్తునట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ శు క్రవారం తెలిపారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నర్ అండ్ చైర్మన్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ఆదేశాలనుసారం జిల్లాలో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలు సజావుగా **వార్తా లోపలి పేజీలో**

# రోడ్డా.. రణరంగమా? గుంతల్లో జారుతున్న ప్రాణాలు!”

ప్రమాదాలు.. ఎఫ్ఐఆర్‌లు.. ఆధారాలు ఉన్నా మరమ్మతుల్లో జాప్యం।
అధిక లోడుపై ఆర్టీవో నిఘా ఏది?




**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 11 ( జనంసాక్షి):**
కొత్తగూడెం -పాల్వంచ?భద్రాచలంజాతీయ రహదారి అంటే సురక్షిత ప్రయాణానికి చిరునామాగా ఉండాలి. కానీ కొత్తగూడెం నుంచి పాల్వంచ మీదుగా భద్రాచలం వైపు వెళ్లే ప్రధాన రహదారి మాత్రం గుంతలు, ఎత్తుపల్లాలు, ఒడుదుడుకులతో ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. రహదారి దుస్థితిపై ఎన్నిసార్లు ఫిర్యాదులు వచ్చినా ప్రమాదాలు జరిగినా ఇంకా పూర్తిస్థాయి మరమ్మతులు ఎందుకు జరగడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. గుంతలు కనిపిస్తున్నాయి ప్రమాదాలు జరుగుతున్నాయి అయినా స్పందన ఎక్కడ?పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం నుంచి కొత్తగూడెం క్రాస్‌రోడ్ వరకు, అలాగే కొత్తగూడెం?భద్రాచలం మార్గంలో పలుచోట్ల రహదారి తీవ్రంగా దెబ్బతింది. భారీ గుంతలు, ఎత్తుపల్లాలు వాహనదారులకు సవాల్‌గా మారాయి. వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు చేరడంతో వాటి లోతు కనిపించకపోవడం మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఇది కేవలం రోడ్డు సమస్య కాదు.. మనుషుల ప్రాణాలతో ముడిపడిన సమస్య. ఇటీవలి కాలంలో ఈ మార్గంలో రోడ్డు పరిస్థితులు, ఎత్తుపల్లాలు, గుంతలు తదితర కారణాలతో ప్రమాదాలు చోటుచేసుకున్న **వార్తా లోపలి పేజీలో**





# రేషన్ డీలర్.. సర్పంచ్ భజనలో బిజీ!




**వార్తా లోపలి పేజీలో**

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లాలో మూడు నియోజకవర్గాలలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 కోట్ల రూపాయల వ్యయంతో హుజూర్ నగర్ నియోజకవర్గం గడ్డిపల్లి, కోదాడ నియోజక వర్గంలోని చిలుకూరు, తుంగతుర్తి నియోజకవర్గం తొండలో మొత్తం 3 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి 600 కోట్ల రూపాయలు ఖర్చు చేయటం జరుగుతుందని అన్నారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయాలని, పనులను నాణ్యత ప్రకారం ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇచ్చిన ఆర్కిటెక్చర్ డిజైన్ ప్రకారం నిర్మాణాలు **వార్తా లోపలి పేజీలో**

# రోడ్డా.. రణరంగమా? గుంతల్లో జారుతున్న ప్రాణాలు!"

ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబు తున్నారు. కొన్ని ప్రమాదాలపై పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదైన ఘటనలు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. అయినా ప్రమాదాలు జరిగే వరకు వేచి చూసి.. ఆ తర్వాతే రోడ్డు మరమ్మతులు చేపట్టే విధానం ఎందుకు? అన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఒకవైపు గుంతలు.. మరోవైపు అధిక లోడు!**

రహదారి దుస్థితికి తోడు భారీ వాహనాల రాకపోకలు కూడా వాహనదారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. నిబంధనలకు మించి అధిక లోడుతో వాహనాలు తిరుగుతున్నాయన్న ఆరోపణ లు వినిపిస్తున్న నేపథ్యంలో ఆర్టీవో అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అధిక లోడుతో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే రహదారి మరింత దెబ్బతినే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గుంతలను ఎన్‌హెచ్ అధికారులు చూడాలి.. అధిక లోడును ఆర్టీవో అధికారులు చూడాలి.. కానీ ఇద్దరి పర్యవేక్షణ మధ్య ప్రజల ప్రాణాలు నలిగిపోవాల్సిందేనా? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రమాదం జరిగిన తర్వాతే కదులుతారా?**

రహదారిపై ప్రమాదకర గుంతలు ఉన్న విషయం అధికారులకు తెలియనిది కాదు. అయినప్పటికీ పూర్తిస్థాయి మరమ్మతులు ఆలస్యం కావడం విమర్శలకు తావిస్తోంది.ఒక ప్రమాదం జరిగిన తర్వాత ఎఫ్ఐఆర్.. మరో ప్రమాదం తర్వాత పరామర్శ.. ఆ తర్వాత హామీలు.. ఇదేనా అధికారుల చర్యల విధానం?ప్రజల ప్రాణాలను కాపాడటానికి ప్రమాదం జరిగే వరకు ఎదురుచూడాల్సిన అవసరం లేదని ప్రయాణికులు అంటున్నారు. ముందుగానే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేయడంతో పాటు, రహదారిపై అధిక లోడుతో ప్రయాణించే వాహనాలపై ఆర్టీవో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారి హామీ ఇచ్చారు.. అమలు ఎప్పుడో?**

రహదారి దుస్థితిపై ప్రశ్నించగా ఎన్‌హెచ్ అధికారి స్పందించారు. పెనుబల్లి? రుద్రంపూర్ నుంచి భద్రాచలం వరకు ప్యాచ్‌వర్క్ పనులకు కాంట్రాక్టర్‌తో సుమారు పది రోజుల క్రితమే ఒప్పందం పూర్తయిందని తెలిపారు.ప్రస్తుతం కాంట్రాక్టర్, ఈఈతో కలిసి రహదారి పరిస్థితిని పరిశీలిస్తున్నామని, ముఖ్యంగా పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం నుంచి కొత్తగూడెం క్రాస్‌రోడ్ వరకు పరిస్థితి ప్రమాదకరంగా ఉందని గుర్తించామని చెప్పారు.కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు ఉన్న గుంతలను ప్యాచ్‌వర్క్‌తో సరిచేస్తామని, వారం నుంచి పది రోజుల్లో రహదారిని శుభ్రం చేసి, మరో రెండు వారాల్లో గుంతలు లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారి హామీ ఇచ్చారు.

**పబ్లిక్ వాయిస్ ...**

**హామీలు కాదు.. పనులు కావాలి!**

అధికారుల హామీపై ప్రయాణికులు స్పందిస్తూ.. "ఇప్పటికే ప్రమాదాలు జరిగాయి.. ప్రాణాలు పోయాయి.. ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.. ఫొటోలు ఉన్నాయి.. ఇక మిగిలింది మరిన్ని ప్రమాదాల కోసం ఎదురుచూడటమేనా?" అని ప్రశ్నిస్తున్నారు.రహదారి మరమ్మతులను తక్షణమే పూర్తి చేయడంతో పాటు ప్రమాదకర ఎత్తుపల్లాలు, గుంతలను శాశ్వతంగా సరిచేయాలని.. అధిక లోడుతో తిరుగుతున్న వాహనాలపై ఆర్టీవో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ప్రాణాలు పోయిన తర్వాత పరిహారం ప్రకటించడం కంటే.. ప్రాణాలు పోకుండా ముందే రహదారిని సురక్షితంగా మార్చడం అధికారుల బాధ్యత కాదా?ఇప్పటికైనా ఎన్‌హెచ్, ఆర్టీవో అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటారా? లేక మరో ప్రమాదం జరిగే వరకు మౌనం వహిస్తారా?పట్టణ ఎస్సై నాగరాజు ను వివరణ కోరగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దశగా కృషి చేస్తున్నామని లారీలు ఆడమ్ కాలేజ్ మీదుగా డైవర్షన్ తీసుకొని వెళ్తున్నాయని పట్టణ వాసులకు వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలిగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పని సరిగా రూల్స్ రెగ్యులేషన్స్ పాటించాలని మద్యం తాగి వాహనాలు నడపరాదని భారీ వాహనాలు పట్టణంలో అనుమతించబడమని అన్నారు.



## సైన్స్ డ్రామా పోటీల్లో జిల్లా ప్రథమ స్థానం సాధించిన క్రిష్ణవేణి విద్యార్థులు

**రామన్నపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ డ్రామా కాంపిటీషన్ పోటీలలో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జిల్లా ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాయగిరి ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డ్రామా కాంపిటీషన్ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం పర్యావరణం అసమతుల్యత వల్ల మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలు, సముద్రాల కాలుష్యం వల్ల ప్రపంచ దేశాలకు ఎదురవుతున్న నష్టాలపై కనిపిస్తు కలిగించే విధంగా " సేవ్ ఓషియన్ సేవ్ ఫ్యూచర్ జనరేషన్" థీమ్ తో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ డ్రామా పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి ప్రోత్సాహం అందించిన గైడ్ టీచర్ మురళి, సహకారం అందించిన ఉపాధ్యాయులు పునందాస్, అలీం, కల్పన తదితరులను కరెస్పాండెంట్ తో పాటు, ప్రిన్సిపాల్ బి.సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె.మణి, ఇతర సిబ్బంది అభినందించారు.

## పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ ది

### గ్రామ సర్పంచ్, గుగులోతు స్వాతి భాస్కర్



**తంగతుర్తి, సెప్టెంబర్ 11, (జనంసాక్షి) :** రాష్ట్రంలో పేద ప్రజలకు రేషన్ కార్డు ద్వారా స్వర్ణ బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని దేవుని గుట్ట తండా సర్పంచ్ గుగులోతు స్వాతి భాస్కర్ అన్నారు, శుక్రవారం మండల పరిధిలోని దేవుని గుట్ట తండాలో లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డు లు పంపిణీ చేసి మాట్లాడారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాం లోనే పేదలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వ సేవ పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది, రేషన్ డీలర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ వేలం పాటను సమర్థించిన హైకోర్టు

### ఆలయ కార్యనిర్వహణాధికారి : గుజ్జుల కొండారెడ్డి



**హుజూర్ నగర్ రూరల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మండలంలోని లింగగిరి లో గల శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ వ్యవసాయ భూముల బహిరంగ వేలం పాటను హైకోర్టు సమర్థించినట్లు ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మేదర వీరయ్య మరో 22మంది దేవాలయ భూములు 23 ఎకరాలను కౌలుకు సేద్యము చేసుకుంటున్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి కౌలు చెల్లించనందున హైకోర్టు ఉత్తర్వుల మేరకు రెండేళ్లకు గాను బహిరంగ వేలం నిర్వహించి భూమిని కౌలుదారులకు అప్పగించడం జరిగింది. అట్టి వేలం పాటను నిలుపుదల చేయుటకు గత కౌలుదారులు ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేయగా శు క్రవారం పరిశీలించిన ధర్మాసనం ఈవో జరిపిన కౌలు బహిరంగ వేలం పాటను సమర్థిస్తూ నిలుపుదలకు వేసిన పిటిషన్ ను అంగీకరించకుండా వేలంను కొనసాగించవలసింది గా తీర్పు చెప్పింది. ఈ విషయమై దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రెండు వారాలలోగా కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

## గురుకులాల్లో వరుస ఘటనలు..

## విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ❍ బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్..
- ❍ జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేక దృష్టి పెట్టి, ఒకటి రెండు రోజులు హాస్టళ్లలోనే బస చేస్తూ ప్రతి హాస్టల్‌ను స్వయంగా సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలి
- ❍ బీసీ యువజన సంఘం డిమాండ్..



**సంస్థాన్ నారాయణపురం. సెప్టెంబర్ 11. (జనంసాక్షి):** సంస్థాన్ నారాయణపూర్ మండల పరిధిలోని గురుకులాలు, వసతి గృహాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ఘటనలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల భద్రత, ఆరోగ్యం విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ డిమాండ్ చేశారు.మండలంలోని కస్తూర్బా గురుకుల పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు బయటకు వెళ్లడం, సర్వేల గురుకుల పాఠశాలలో ఇద్దరు బాలురు గోడ దూకి తిరుపతికి వెళ్లడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నందున వారి భద్రత విషయంలో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.అదేవిధంగా గిరిజన గురుకుల పాఠశాలలో సుమారు 15 మంది విద్యార్థులు జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని తాను స్వయంగా గురుకులాన్ని సందర్శించినట్లు కార్తీక్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల మేడమ్, డాక్టర్‌తో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నానన్నారు. జ్వరం వచ్చిన విద్యార్థులను మిగతా విద్యార్థుల నుంచి వేరు చేసి ప్రత్యేక గదిలో ఉంచి సుమారు మూడు రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉంచాలని సూచించినట్లు తెలిపారు.గురుకులంలోని వంటశాలను కూడా పరిశీలించి పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న ఆహారం తదితర అంశాలను పరిశీలించినట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు.ప్రస్తుతం గిరిజన గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుండటం, ఒకే భవనంలో తరగతి గదులతో పాటు విద్యార్థుల వసతి కొనసాగడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఒక విద్యార్థికి జ్వరం వచ్చినప్పుడు ఇతర విద్యార్థులకు కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున శాశ్వత భవనం ఎంతో అవసరమన్నారు.గిరిజన గురుకుల పాఠశాల కోసం ఇప్పటికే ఐదు ఎకరాల స్థలం కేటాయించినందున, ఆ స్థలంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన సొంత పక్కా భవనం నిర్మాణానికి గౌరవ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. భవనం నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మెరుగైన వసతి, తరగతి గదులు, పరిశు భ్రమైన వాతావరణం కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు.అలాగే జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేక దృష్టి సారించి మండలంలోని ప్రతి గురుకులం, కస్తూర్బా పాఠశాల, హాస్టల్‌ను స్వయంగా సందర్శించాలని కోరారు. వీలైతే ఒకటి రెండు రోజులు హాస్టళ్లలోనే బస చేసి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, భోజనం, వసతి, విద్య, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని బీసీ యువజన సంఘం తరఫున డిమాండ్ చేశారు.విద్యార్థుల భద్రత విషయంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి హాస్టల్‌లో పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వీరమళ్ళ కార్తీక్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ కార్యదర్శి కట్కూరి శ్రీకాంత్, బీసీ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొత్త రాజు, చెరుకే యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలి: ఎస్ఐ నవీన్ కుమార్

**మేళ్లచెరువు జనంసాక్షి**
మేళ్లచెరువు మండలంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మేళ్లచెరువుపోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో నిర్వహించారు. మేళ్లచెరువు మండల స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీస్ శాఖ నిబంధనలను నిర్వాహకులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్ కుమార్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఎల్లప్పుడూ ఇద్దరు లేదా ముగ్గురు కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, రాత్రి వేళల్లో విగ్రహాల రక్షణకు నిర్వాహకులు పహారా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.



మండపాల విద్యుత్ కనెక్షన్ల విషయంలో విద్యుత్ శాఖ నిబంధనలు పాటించాలని, నాణ్యమైన వైర్లను వినియోగించి షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత వరకు మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమతించిన సమయాల్లో మాత్రమే మైకులు, లౌడ్‌స్పీకర్లు వినియోగించాలని, రాత్రి 10 గంటల తర్వాత మైకులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మండపాల ఏర్పాటుతో ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో చెరువులు, నదుల వద్ద పోలీస్, రక్షణ సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలి

## జానలదిన్నె గ్రామంలో పశు వైద్యశాల,సబ్ సెంటర్ ని ఏర్పాటు చేయాలి

### సామాజిక కార్యకర్త తక్కెళ్ల నాగార్జున

**నేరేడుచర్ల సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**



మండలంలో జానలదిన్నె గ్రామపంచాయతీలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యశాల సబ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త తక్కెళ్ళ నాగార్జున ప్రకటనలో తెలియచేశారు.మా ప్రాంతమైన జానలదిన్నె, మరియు పత్తేపురం, వైకుంటపురం,లాల్ లక్ష్మిపురం, విజయనగరం,మంగళగూడెం మరియు సమీప గ్రామాలలో సుమారు 7 వేల నుండి 8వేల వరకు పశువులు ఉన్నాయన్నారు.ఈ గ్రామాల రైతులు,పశు పోషకులు తమ జీవనాధారంగా పశుసంపదపై ఆధారపడి ఉన్నారన్నారు.ప్రస్తుతం మా ప్రాంతంలో పశువులకు వైద్య సేవలు అందించడానికి పశు వైద్యశాల లేకపోవడంతో,పశువులకు అనారోగ్యం వచ్చినప్పుడు దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు.దీనివల్ల రైతులకు ఆర్థిక భారం పెరగడంతో పాటు,అత్యవసర పరిస్థితుల్లో పశువులకు ప్రాణనష్టం కూడా జరుగుతోందన్నారు.మా ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని,జానలదిన్నె కేంద్రంగా పై గ్రామాలకు ఉపయోగపడే విధంగా పశు వైద్యశాల సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య సిబ్బందిని, ఔషధ సౌకర్యాలను కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు.పశు వైద్యశాలకి తన సొంత స్థలాన్ని ఇస్తానని తెలియజేశారు.



## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

పూర్తి చేయాలని ఆదేశించారు.మిగిలినటువంటి సమగ్ర శిక్ష అభియాన్ పనులను కూడా అనుకున్న సమయం ప్రకారం పూర్తి చేయాలని,ఈ పనుల పురోగతిపై ప్రతివారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో ఎస్ఈ భాను ప్రసాద్, డిఇఓ అశోక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ కుమార్, ఏఈ ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలి

### రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు: సుర్వి యాదయ్య గౌడ్..

**సంస్థాన్ నారాయణపురం. సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** సంస్థాన్ నారాయణపురం: వ్యవసాయ బావులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, సర్పంచుల సంగం రాష్ట్ర జేపీసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 8 గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయలేకపోతుందని అన్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ కోతలు, వోల్టేజ్ హెచ్చుతగ్గుల కారణంగా వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, పంపులు కాలిపోతూ రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రైతుల కష్టాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి వ్యవసాయానికి సరిపడా విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, లో-వోల్టేజ్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ లైన్లను బలోపేతం చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని సుర్వి యాదయ్య గౌడ్



స్పష్టం చేశారు.ఈ మహాధర్నాలో సీనియర్ నాయకులు తెలంగాణ బిక్షం, చిలువేరు బిక్షపతి, బొడ్డుపెల్లి గాలయ్య, జక్కిడి యాదిరెడ్డి, ఉపల ఆంజనేయులు, పాలకూర్ల సతీష్ గౌడ్, డాక్టర్ ఎర్రోళ్ల లింగస్వామి, రాసాల వెంకటేశం, చిలువేరు శంకర్, ఎడ్ల సత్తయ్య యాదవ్, ఎర్రోళ్ల వెంకటేష్, చిలువేరు వెంకటేశం, బొమ్మగోని రమేష్ గౌడ్, పవన్ కళ్యాణ్, నేనావత్ జగ్గు, మారగోని వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువులోనూ కాదు క్రీడల్లో రాణించాలి

### సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు

**తుంగతుర్తి సెప్టెంబర్ 11 (జనంసాక్షి)**
విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, చదువుకు అవసరమైన జ్ఞానం, ఆలోచన శక్తి నీ క్రీడలు పెంపొందిస్తాయని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాసరెడ్డి,మలిపెద్ది శ్రీనివాస్ రెడ్డి, కార్తీక్ రెడ్డి దాతల సహకారంతో నిర్వహించిన ఎస్జిఎఫ్ మండల స్థాయి ఖోఖో క్రీడలకు సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి టోర్నమెంట్స్ అనేవి గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ప్రాథమిక పునాదిగా నిలుస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తూ జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మండల స్థాయిలో నిర్వహించే క్రీడలు క్రీడాకారులకు పునాది లాంటిదన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరు కాగా అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగంలో ఖోఖో టోర్నమెంటులో ఎంపిక పోటీలు నిర్వహించారు. ముందుగా క్రీడల దిగ్గజం ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత



రాణి జ్యోతి ప్రజ్వలన చేయగా జాతీయ జెండాను మండల విద్యాధికారి బోయిని లింగయ్య, కామన్వెల్త్ గేమ్స్ జెండాను గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, ఎస్జిఎఫ్ జెండాను ప్రధానోపాధ్యాయురాలు సునీత రాణి ఆవిష్కరించగా క్రీడా జ్యోతిని అతిథులు వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చేసిన మార్చి ఫాస్ట్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చలపతి,తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఎస్జిఎఫ్ జిల్లా సెక్రటరీ మంద కిరణ్ కుమార్, నియోజకవర్గ సెక్రటరీ యాదగిరి,తుంగతుర్తి మండల కన్వీనర్ కొండగడుపుల యాకయ్య, గ్రామ ఉపసర్పంచ్ వెలిశాల సునీత, గ్రామ పాలకవర్గం సభ్యులు,మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు,వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## హాలియా మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవగాహన సదస్సు

హాలియా సెప్టెంబర్ 11జనంసాక్షి
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు హాలియా మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ శ్రీ చింతల చంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, హౌసింగ్ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు అధికారులు మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.ముఖ్యాంశాలుమున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఏవైనా సందేహాలు ఉంటే ఈ కార్యక్రమం ద్వారా నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.లబ్ధిదారులు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోవాలని, ఇంటి పై కప్పు మీద పడిన వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవాలని సూచించారు.చెల్లింపులు, ఆధార్ సీడింగ్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే హౌసింగ్ శాఖ ఏఈ, డీఈ అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మున్సిపల్ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి మాట్లాడుతూ, హాలియా మున్సిపాలిటీ



పరిధిలో ఇప్పటివరకు 232 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబడ్డాయని, లబ్ధిదారులు వీటిని త్వరితగతిన పూర్తి చేస్తే గుడిసెలు ఉన్నవారికి మరో 60 ఇండ్లు కొత్తగా మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసుకోవాలని, అనవసరంగా ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టుకొని ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు."హాలియా మున్సిపాలిటీని గుడిసెలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు ప్రసాద్ నాయక్ చెరుపల్లి ముత్యాలు , కౌన్సిలర్ సలహాదారులు మజ్హాహ ర్ మైనుద్దీన్, చిట్టిపోలు కరుణాసాగర్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మరియు వార్డు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి

## అన్నపురెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ రోహిత్ రాజు వార్షిక తనిఖీలు

## పెండింగ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లపై ప్రత్యేక దృష్టి



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 11 (జనం సాక్షి)**
అన్నపురెడ్డిపల్లి మండల పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, నేరాల నమోదు తీరు, ఫిర్యాదుల రిజిస్టర్లు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నిబద్ధతతో, పకడ్బందీగా అప్‌డేట్ చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

**ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి**
స్టేషన్ పరిసరాలు, మౌలిక వసతులను పరిశీలించిన ఎస్పీ.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు అత్యంత స్పందనతో వ్యవహరించాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

**నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు**
మండల పరిధిలో రాత్రివేళ పోలీసు గస్తీని ముమ్మరం చేయాలని ఎస్పీ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లను వేగంగా అమలు చేయడంతో పాటు, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రజలకు భద్రతపై నమ్మకం కలిగేలా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వార్షిక తనిఖీల్లో సీఐ విజయ్ లక్ష్మి, ఎస్సై విజయ్ సింహారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అండర్-14,అండర్-17 బాల,బాలికల క్రీడలు ప్రారంభం

**○విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం..**
**○మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రమౌళి, మండల విద్యాధికారి ధన్నె రాజు**
**○ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు**

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 11(జనంసాక్షి):**
అండర్-14, అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి,వారిని జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలకు తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రమౌళి,మండల విద్యాధికారి ధన్నె రాజు మరియు నిర్వాహకులు తెలిపారు.వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన,క్రీడాస్ఫూర్తి,నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు తదుపరి స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

# వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి ఎస్ఐ

**చింతపల్లి, సెప్టెంబర్ 11(జనంసాక్షి)**



వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాలకు నిర్వాహకులు ముందస్తుగా తప్పనిసరిగా ఆన్లైన్ లో అప్లై చేసుకోవాలని ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి సూచించారు. అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండపాల ఏర్పాటుతో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా తగిన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల వద్ద డీజేలు వినియోగించే సమయంలో పోలీసుల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

# ప్రభుత్వ హాస్పిటల్ ను పరిశీలించిన బీజేపీ నాయకులు

**○ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్య సేవలు మెరుగుపరచాలి**
**○రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలి**

**చింతపల్లి, సెప్టెంబర్ 11(జనంసాక్షి)**
చింతపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ నుశుక్రవారం బీజేపీ మండల నాయకులు సందర్శించారు. హాస్పిటల్ లో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందుతున్న మందులు, పరీక్షల సౌకర్యాలపై వారు ఆరా తీశారు. వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.టీబీ రోగులకు అవసరమైన మందులను సకాలంలో అందించాలని, మూత్రం, రక్త పరీక్షలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్య సదుపాయాలు మరింత మెరుగుపరచాలని అధికారులను కోరారు. హాస్పిటల్ లో మందుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలకు పాముకాటు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని, పాముకాటుకు గురైన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, రాష్ట్ర నాయకులు చెనమోని రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కుకుడపు రామకృష్ణ,



సీనియర్ నాయకులు రమణారావు, జిల్లా నాయకులు శివర్ల రమేష్, గొడుగు శ్రీనివాస్, వనం శేషు, కట్ట సైదులు, తీదేడు ఉపసర్పంచ్ వెంకటయ్య, ఎమ్మెస్ సైదులు, జక్కుల రమేష్, బొడ్డు మహేష్, గుండ్లపల్లి లక్ష్మణ్, పాలకూర రాజు, గజ్జి అభినవ్, మొగిలమోని మల్లేష్, మొగిలమోని రవి, గడ్డి సైదులు, శివర్ల నగేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## మట్టి వినాయకులనే పూజిద్దాం..

# పర్యావరణాన్ని కాపాడుకుందాం:

## పినాకిల్ విద్యాసంస్థల అధినేత మదార్

**నేరేడుచర్ల సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**



నేరేడుచర్ల పట్టణంలోని పినాకిల్ పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా శుక్రవారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల విగ్రహాలకు స్వస్తి పలికి, పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలను పినాకిల్ పాఠశాల విద్యార్థులు స్వయంగా తయారు చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం మార్గదర్శకత్వంలో విద్యార్థులే స్వయంగా మట్టిని సేకరించి, అత్యంత నైపుణ్యంతో ఈ విగ్రహాలను రూపొందించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పినాకిల్ పాఠశాల విద్యార్థులు నేరేడుచర్ల పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేతుల్లో మట్టి వినాయక విగ్రహాలు, పర్యావరణ నినాదాల ప్లకార్డులు పట్టుకుని పట్టణ పురవీధుల గుండా సాగిన ఈ ర్యాలీ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు ఇంటింటికీ తిరుగుతూ మట్టి వినాయక విగ్రహాల ప్రాముఖ్యతను, రసాయన విగ్రహాల వల్ల జరిగే నష్టాలను పట్టణ ప్రజలకు వివరించి, అవగాహన కల్పించారు.

**పినాకిల్ విద్యాసంస్థల అధినేత మదార్ సార్ మాట్లాడుతూ..**
"కేవలం పుస్తకాల్లోని చదువే కాకుండా, సమాజం పట్ల బాధ్యతను, పర్యావరణం పట్ల అవగాహనను పెంపొందించుకోవడమే నిజమైన విద్య అని మన విద్యార్థులు నిరూపించారు. "మట్టి వినాయకుని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం"అనేది కేవలం ఒక నినాదం కాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత కావాలి అని అన్నారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల మన నీటి వనరులు కలుషితమై జీవకోటికి ముప్పుగా మారుతున్నాయి అని, ఈ ముప్పు నుండి ప్రకృతిని కాపాడటానికి మన పాఠశాల పిల్లలు ఉపాధ్యాయుల సహాయంతో మట్టిని సేకరించి, తమ చేతులతో వినాయకుడిని మలచడమే కాకుండా, పట్టణంలో భారీ ర్యాలీ ద్వారా ప్రజల్లో చైతన్యం తేవడం ఎంతో అభినందనీయం అని అన్నారు. ఈ వినాయక చవితికి మనమందరం మట్టి వినాయకులనే పూజించి, పిల్లలు చూపిన ఈ పర్యావరణ హిత మార్గంలో నడుద్దామని పిలుపునిచ్చారు. నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు ప్రజలందరికీ మరియు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# కలెక్టర్ జోక్యం చేసుకుంటేనే కదలిక వస్తుందా..?

**నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారా..?**
**సుబ్బయ్యకుంట శిఖం హద్దులపై శాఖల మధ్య నిందారోపణలు**

**సింగరేణి (కారేపల్లి) సెప్టెంబర్ 11, జనంసాక్షి :**
సుబ్బయ్యకుంట చెరువు శిఖం భూమి పరిరక్షణ విషయంలో అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణలపై నోటీసులు జారీ చేశామని చెబుతున్న అధికారులు.. క్షేత్రస్థాయిలో చెరువు హద్దులను మాత్రం ఇప్పటికీ స్పష్టంగా ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు ఇవ్వడం తప్ప ఆక్రమణలను అడ్డుకునే చర్యలు ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారు.
ఈ విషయమై శుక్రవారం ఎమ్మార్వోను సంప్రదించగా.. సర్వేయర్ అందుబాటులో లేరని, విషయం తమ దృష్టిలో ఉందని తెలిపారు. మరోవైపు ఇరిగేషన్ శాఖ అధికారిని సంప్రదించగా.. హద్దుల ఏర్పాటు కోసం ఎమ్మార్వోల దృష్టికి తీసుకెళ్లామని, అయినా హద్దులు ఏర్పాటు చేయడం లేదని పేర్కొన్నట్లు సమాచారం. దీంతో చెరువు శిఖం హద్దులు నిర్ణయించే విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయం కొరవడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**చెరువులే రైతులకు ఆధారం..**
ఎల్ నీ నో ప్రభావంతో తక్కువ వర్షపాతం పరిస్థితులు, ఎండల ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్న వేళ చెరువుల ప్రాధాన్యత మరింత పెరిగింది. మండలంలో చెరువుల కింద సుమారు వందల ఎకరాలలో రైతులు వరి సాగు చేసిన పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో చెరువుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు.. చెరువు శిఖం భూముల విషయంలో మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**తూములపై కఠినంగా.. శిఖం ఆక్రమణలపై ఎందుకు మౌనం?**
చెరువుల్లో అనుమతి లేకుండా తూముల ద్వారా నీటి వినియోగించడంపై చర్యలు తప్పవని ఇరిగేషన్ అధికారులు బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. మరి అదే చెరువు పరిధిలో శిఖం భూమి ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణలు వస్తున్నప్పుడు త్వరితగతిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. రైతుల సాగుకు కీలకమైన చెరువులను కాపాడటంలో అధికారులు ఒకే విధమైన కఠిన వైఖరి అవలంబించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**కలెక్టర్ స్పందించాలి**
సుబ్బయ్యకుంట చెరువు శిఖం భూమి హద్దులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి అధికారికంగా నిర్ధారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆక్రమణలు ఉన్నాయా? ఉంటే ఎవరి ఆధీనంలో ఉన్నాయి? గతంలో జారీ చేసిన నోటీసులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? హద్దురాళ్లు ఎందుకు ఏర్పాటు చేయలేదు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.
శాఖల మధ్య సమన్వయ లోపంతో చెరువు భూమి అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఏర్పడితే బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సంయుక్త సర్వే చేయించి చెరువు హద్దులను గుర్తించి, ఆక్రమణలు ఉంటే తక్షణమే తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# వైటీపీఎస్ ప్రైవేటీకరణ నిరసిస్తూ...
# బిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ ను నిర్బంధించిన విద్యుత్ జేఏసీ నాయకులు..



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 11( జనంసాక్షి):** వైటిపిఎస్ లోని కోల్ , యాష్ ప్లాంట్లను ప్రైవేటీకరించే ప్రయత్నాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ుఉఖఇ ( తెలంగాణ పవర్ ఎంప్లాయిస్) జేఏసీ సెంట్రల్ కమిటీ పిలుపుమేరకు బిటిపిఎస్ లో శుక్రవారం చీఫ్ ఇంజనీర్ బిచ్చన్నను నిర్బంధించారు. చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ నిరసన ను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ బీటీపిఎస్ కన్వీనర్ బి.రవి ప్రసాద్ మాట్లాడుతూ వైటిపిఎస్ ప్రైవేటీకరణ అంశాన్ని జేఏసీ నాయకులతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని మేనేజ్మెంట్ గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఉద్యోగ సంఘాలతో చర్చించకుండానే ఏకపక్షంగా ప్రైవేటు వ్యక్తులకి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణ టెండర్ పై ఇప్పటికే జెన్కో లో ఇద్దరి డైరెక్టర్ సంతకాలు అయినట్లు తమకు సమాచారం ఉందని పేర్కొన్నారు. మరో ఉన్నతాధికారి సంతకం కోసం గురువారం ప్రయత్నించారని చెప్పారు. ఈ ఉన్నతాధికారి సంతకం కూడా పూర్తయితే టెండర్ ప్రైవేట్ వ్యక్తులకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ుఉఖఇ ( తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ )బ్రాంచ్ సెక్రటరీ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ుఇంఇ( తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ )నాయకులు డి.మహేష్, కార్మిక సంఘం -1535 అధ్యక్షులు వి.ప్రసాద్, కార్మిక సంఘం-1104 ప్రధాన కార్యదర్శి బి.సత్యనారాయణ, ఏఐటియుసి అధ్యక్షులు శోభన్, ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ సిద్ధిలే హుస్సేన్, ఉమన్ ఎంప్లాయిస్ నాయకురాలు అల్తాఫా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికి సమీక్షా సమావేశం
## అశ్వాపురం మండల స్థాయి సమావేశంలో సర్పంచుల వినతులు



**అశ్వాపురం సెప్టెంబర్ 11 (జనంసాక్షి)**
గ్రామ పంచాయతీల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై అశ్వాపురం మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ముత్యాలరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి మండల ప్రత్యేక అధికారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.చందన అధ్యక్షత వహించారు. సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో అశ్వాపురం పంచాయతీ పరిధిలో 15 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ బాణోత్ సదర్‌లాల్ కోరారు. చింత్రియాల, చింత్రియాల కాలనీ పంచాయ ుతీలకు అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేయాలని ఆయా సర్పంచులు విజ్ఞప్తి చేశారు. తుర్రంవారిగూడెం, యాలకలగూడెం, గొందిగూడెం కొత్తూరు, మనుబోతులపాడు, బట్టీలగుంపు పంచాయతీలలో భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సర్పంచులు కోరారు.

**ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి:**
మండలంలోని ప్రతి ఇంటిలో వీబీజీ రాంజీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు (సోక్‌పిట్స్) నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ముత్యాలరావు సూచించారు. అలాగే చేయూత పెన్షన్లకు ఈ నెల 15వ తేదీ చివరి గడువు ఉన్నందున అర్హత ఉన్న వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రతి 45 రోజులకు నిర్వహించే మండల స్థాయి సమీక్షా సమావేశాల ద్వారా గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవచ్చని ప్రత్యేక అధికారి చందన తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో పలువురు సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్
## చిట్టిరామవరం తండాలో డిజిటల్ భూ రీ సర్వే పనుల పరిశీలన



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్11 (జనం సాక్షి):**కొత్తగూడెం మండలం చిట్టిరామవరం తండాలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను వినియోగిస్తూ చేపడుతున్న డిజిటల్ భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్, సర్వేలో అనుసరిస్తున్న విధానం, భూముల కొలతలు, వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనుల పురోగతిపై సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. అనంతరం స్థానిక రైతులతో అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి భూ రీ సర్వేకు సంబంధించి వారి అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు.
సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి సహకరించాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రీ సర్వే ద్వారా భూముల వివరాలు మరింత కచ్చితంగా నమోదు కావడంతో పాటు భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రీ సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్ డాక్టర్ స్వప్న, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు వినాయకచవితి వేడుకలు

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**
అర్వపల్లిలోని పీఎం శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ లో మట్టివిగ్రహాలతో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టితో విగ్రహాలను చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎచ్ ఎం పి. మల్లేష్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మండల గ్రామ పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష
## రెవెన్యూ,వైద్య,ఆర్అండ్‌బీ, భవనాల,పశుసంవర్ధక శాఖల అధికారులు గైర్హాజరు
## కీలక శాఖల అధికారులు గైర్హాజరు షోకాజ్ నోటీసులు ఇస్తామన్న ప్రత్యేక అధికారి

**ఆళ్లపల్లి,సెప్టెంబర్11(జనంసాక్షి)**
మండలంలోని గ్రామపంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం. ఆళ్లపల్లి ప్రత్యేక అధికారి,ఇల్లందు ఏడీఏ జి. లాల్‌చంద్,ఎంపీడీవో ధీరావత్ శీను అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరై తమ పరిధిలోని సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. మండలంలోని మొత్తం18 శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరు కావాల్సి ఉండగా, కేవలం 10 శాఖల అధికారులు మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. మరో 8 శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరయ్యారు. ముఖ్యంగా. రెవెన్యూ,వైద్య, రోడ్లు, భవనాలు, పశుసంవర్ధక శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడం చర్చ నీయాంశంగా మారింది. సమావేశంలో గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు,వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. మండల వైద్య శాఖ అధికారులు సిబ్బంది ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించకుండా మండల ప్రభుత్వ వైద్య దేవకానకు సకాలంలో వచ్చిన పేషెంట్లకు వైద్యం వైద్యం కరువైపోతుందని మండల ప్రజల ఆరోపణ మండల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అభివృద్ధి పనుల్లో ఎదురవుతున్న. ఇబ్బందులు,ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు,వివిధ శాఖల నుంచి అందాల్సిన సహకారం తదితర సమస్యలను వెల్లువెత్తారు. ముఖ్యంగా విద్యాశాఖకు సంబంధించి పలు అంశాలపై ఆరోపణలు, ఫిర్యాదులు సమావేశంలో చర్చించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అన్ని శాఖల సమన్వయం ఎంతో అవసరమని, అధికారులు తమ శాఖల పరిధిలోని సమస్యల పరిష్కారానికి బాధ్యతగా వ్యవహరించాలని ప్రత్యేక అధికారి సూచించారు. ముఖ్యమైన సమీక్ష సమావేశానికి కీలక శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ప్రత్యేక అధికారి జి.లాల్‌చంద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలు,అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులు,సమావేశాలకు హాజరు కాకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు అందజేస్తామని ప్రత్యేక అధికారి. హెచ్చరించారు. అధికారులు కీలకమైన సమీక్ష



సమావేశానికి గైర్హాజరు కావడంపై పలువురు సర్పంచులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని, సమావేశాలకు హాజరై తమ శాఖలకు సంబంధించిన సమస్యలపై స్పందించాలని కోరారు. గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో మండల సర్పంచులు పాయం రామ నరసయ్య,సుతారి రమాదేవి, వాసం సుస్మిత,తెల్లం సంధ్యారాణి, పాయం సూర్యకాంత, కల్తి వెంకటేశ్వర్లు, ఈసం రుక్మిణి,వజ్జ ఉమా తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఎస్ ఎస్ సి బ్యాచ్

**సంస్థాన్‌నారాయణపురం. సెప్టెంబర్ 11(జనంసాక్షి):**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గనం యాదగిరి అకాల మరణం చెందారు. వారి ఎస్ ఎస్ సి బ్యాచ్ 2005-2006 సంవత్సరానికి చెందిన విద్యార్థులు యాదగిరి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 15000 రూపాయలు వారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ మిత్రుడు తమతో గడిపిన క్షణాలను నెమరు వేసుకుంటూ బాదసప్త హృదయాలతో ఘనం యాదగిరి చిత్రపటానికి పువ్వులు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి మనోధైర్యంగా ఉండాలని తమ మిత్రుని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ జంగయ్య, గనం జంగయ్య, రాచకొండ యాదగిరి, బాలగోని వెంకటేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఖమ్మం వేదికగా జనసేన శంఖారావం

## ముగ్గురు మంత్రుల వైఫల్యంపై గడల శ్రీనివాసరావు ఫైర్




- సెప్టెంబర్ 13న ఖమ్మంలో.. జనసేన శంఖారావం..!
- సభా వేదికకు 'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం'గా నామకరణం..
- ఖమ్మం కేబుల్ బ్రిడ్జికి 'వనజీవి రామయ్య వారధి'గా పేరు పెట్టాలి..
- మీడియా సమావేశంలో జనసేన నాయకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు డిమాండ్..

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 11(జనం సాక్షి)** ఉద్యమాల గుమ్మం ఖమ్మంలో ఈనెల 13న జరగబోవు "తెలంగాణ రాష్ట్ర శంఖారావం" సభను విజయవంతం చేయాలని ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జనసేన పార్టీ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం కాల్వఒడ్డులోని ఓ గార్డెన్స్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో జరిగిన చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ పలు కీలక అంశాలను వెల్లడించారు. అన్ని వర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సభకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి తోపాటు, ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి రాక్. సాగర్ ఇతర అగ్ర నాయకులు హాజరవుతారని తెలిపారు.

**సభా వేదిక కు 'వనజీవి రామయ్య ప్రాంగణం'గా నామకరణం..**

ఈనెల 13న ఖమ్మం ఎంబీ గార్డెన్స్ వేదికగా నిర్వహించే జనసేన పార్టీ "తెలంగాణ రాష్ట్ర శంఖారావం" భారీ బహిరంగ సభా వేదికకు పర్యావరణ ప్రేమికుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గౌరవార్థం "వనజీవి రామయ్య ప్రాంగణం" గా నామకరణం చేస్తున్నట్లు డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రకటించారు. అదేవిధంగా ఖమ్మం కేబుల్ బ్రిడ్జికి 'వనజీవి రామయ్య వారధి'గా పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.కోట్లాది మొక్కలు నాటి దేశవ్యాప్తంగా ఖమ్మం జిల్లాకు గుర్తింపు తెచ్చిన వనజీవి రామయ్య గారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**ముగ్గురు మంత్రుల పనితీరుపై విమర్శలు..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల పనితీరు నిరాశాజనకంగా ఉందని డాక్టర్ గడల ధ్వజమెత్తారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉన్నా జిల్లా సమగ్ర అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. నిరుద్యోగ యువత, ఉద్యోగులు, పట్టభద్రుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా జనసేన పనిచేస్తుందని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజమైన ప్రజా గొంతుకగా నిలవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ శంఖారావం సభ ద్వారా పార్టీ భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు రాము యాదవ్, ఖమ్మం జిల్లా కోఆర్డినేట్ మిర్యాల రామకృష్ణ, సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి నరేష్, జిల్లా నాయకులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, వీర మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 11 (జనంసాక్షి): శనివారం జరిగే లోక్ అదాలత్‌ను సద్విని తీసుకోవాలని అర్వపల్లి ఎస్సై పి మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదా ల త్ లో రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, పెండింగ్, చెక్ బౌన్స్, చిన్న చిన్న వివాదాలతో పాటు రాజీ చేయదగిన కేసులను ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించు కోవాలని చెప్పారు. పరిష్కారం కోరేవారు పోలీస్ స్టేషన్ ను, న్యాయ సంస్థ అధికారులను సంప్రదించాలని చెప్పారు.

### పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల వస్తువులు వెంటనే ఇవ్వాలి



కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): కొత్తగూడెం కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులకు గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బట్టలు, సబ్బులు, నూనె, బెల్లం, చెప్పులు, శానిటేషన్ కిట్లు, పని పరికరాలను వెంటనే అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ కార్మికుల పట్ల వివక్ష తగదని, పెండింగ్ వస్తువులను వెంటనే అందించడంతో పాటు పనిభారానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. కాగా, కార్మికులకు ఇవ్వాల్సిన వస్తువులన్నింటినీ సెప్టెంబర్ 15న అందజేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంబాల దుర్గమ్మ, చందర్, సుశీల, అశోక్, నరశయ్య, మల్లీశ్వరి, రాజలక్ష్మి, సునీల్, సంజీవ్, ప్రకాష్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.




### ముదిరాజుల హక్కుల కోసం పోరాడాలి

**అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ముదిరాజుల ముందస్తు అరెస్ట్**

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** ముదిరాజుల హక్కుల సాధనకు ముదిరాజులందరూ ఐక్యంగా పోరాడాలని ములకలపల్లి రాంబాబు, లక్క వెంకన్న, కంటూ నాగరాజు, శీలం వెంకి పిలుపునిచ్చారు. శుక్రవారం ముదిరాజుల హక్కుల సాధనకై అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో పట్టణంలోని ముదిరాజ్ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజ్ లను బీసీ-ఏలో చేర్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్ కు ప్రత్యేకంగా 1000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసుల అరెస్టులతో ముదిరాజ్ ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ముదిరాజుల హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకర ప్రసాద్, ములకలపల్లి లక్ష్మణ్, ఇంటి రవి, బుడిగె మహేష్, కొమర బోయిన వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద భద్రతా నియమాలు తప్పనిసరి

- అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయొద్దు..
- డీజేలకు నో పర్మిషన్
- ప్రతి మండపం వద్ద ముగ్గురు వాలంటీర్లు.. సీసీ కెమెరాలు,
- అగ్నిమాపక ఏర్పాట్లు తప్పనిసరి: ఎస్ఐ మేడా ప్రసాద్

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 11 (జనంసాక్షి)** రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు పాటించాలని సారపాక ఎస్ఐ మేడా ప్రసాద్ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు, మండల సర్పంచులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు కీలక మార్గదర్శకాలను వెల్లడించారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముందుగానే పోలీస్ శాఖకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో మండప వివరాలను నమోదు చేసి, అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. మండపాలకు విద్యుత్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఉత్సవాల సమయంలో మండపాల వద్దగానీ, గణేష్ నిమజ్జన ఊరేగింపుల్లోగానీ డీజేలను వినియోగించరాదని ఎస్ఐ తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లౌడ్‌స్పీకర్లు, డీజేలు వినియోగించవద్దని సూచించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, రెచ్చగొట్టేలా ఉండే పాటలు, నినాదాలకు పూర్తిగా దూరంగా ఉండాలని హెచ్చరించారు.ప్రతి గణేష్ మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24 గంటలూ అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రతా పర్యవేక్షణ కోసం మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక బకెట్లు, నీటి సౌకర్యం లేదా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్ఐ మేడ ప్రసాద్ కోరారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే 112కు సమాచారం అందించాలని సూచించారు.



### తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

**తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం**



**చింతపల్లి, సెప్టెంబర్ 11(జనంసాక్షి)** సెప్టెంబర్ 17న తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చింతపల్లి మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చెనమోని రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కుకుడపు రామకృష్ణ, శివర్ల రమేష్, సీనియర్ నాయకులు రమణారావు, వెంకటయ్య, కట్ట సైదులు, వనం శేషు, బొడ్డు మహేష్, గొడుగు శ్రీనివాస్, ఎమ్మెస్ సైదులు, గుండ్లపల్లి లక్ష్మణ్, జక్కుల రమేష్, పాలకూర రాజు, గజ్జి అభినవ్, మొగిమోని మల్లేష్, మొగిలమోని రవి, శివర్ల నగేష్, కుందేళ్ల చెన్నయ్య, గడ్డి సైదులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బైక్-డీసీఎం ఢీకొని యువకుడు మృతి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి)**
హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పై పంతంగి టోల్‌గేట్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా నదిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన నోముల నాగమ్మ, మల్లయ్యల చిన్న కుమారుడు నోముల దీపక్ (22) హైదరాబాద్‌లో కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సెప్టెంబర్ 10వ తేదీ రాత్రి దీపక్ తన స్నేహితులైన దున్నపోతుల శ్రీకాంత్ , చీమ ఉదయ్ లతో కలిసి బైక్‌లపై స్వగ్రామానికి బయలుదేరారు. దీపక్, శ్రీకాంత్‌లు బైక్‌పై వెళ్తుండగా, ఉదయ్ మరో బైక్‌పై వారిని అనుసరిస్తున్నాడు. రాత్రి సుమారు 9:20 గంటల సమయంలో పంతంగి టోల్‌గేట్ సమీపంలోకి రాగానే, వీరి ముందు వెళ్తున్న ఒక గుర్తుతెలియని డీసీఎం వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేసింది. దీంతో వేగంగా వస్తున్న బైక్ కంట్రోల్ కాక డీసీఎంను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీపక్ తల డీసీఎం వెనుక ఉన్న హుక్‌కు గుచ్చుకోవడంతో తల పగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనుక కూర్చున్న శ్రీకాంత్ తీవ్ర గాయాలయ్యాయి. వెనుక వస్తున్న ఉదయ్ కూడా బైక్ కంట్రోల్ కాక కిందపడటంతో స్వల్ప గాయాల పాలయ్యాడు. ఉదయ్ సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అంబులెన్స్ లో బాధితు లను చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాంత్‌ను హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మృతుని తల్లి నాగమ్మ ఆసుపత్రికి చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ డి.నర్సిరెడ్డి తెలిపారు.

# పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేత



**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేటకు చెందిన నీలా రాజ్యలక్ష్మి ఇటీవల ప్రమాదవశాత్తు గాయాలు కావడంతో తొంటి ఆపరేషన్ చేయాలని డాక్టర్ సూచించగా శుక్రవారం శ్రీవాసవి రక్షణ కవచం ఆధ్వర్యంలో పదివేల రూపాయలు ఆర్థిక సహాయంను ఆమె కూతురు ఉషారాణికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవాసవి రక్షణ కవచం నిర్వాహకులు బచ్చు పురుషోత్తం మాట్లాడుతూ సూర్యాపేటలో మొట్టమొదటిసారిగా శ్రీవాసవి రక్షణ కవచం సోషల్ మీడియా వేదికగా దాతల సహకారంతో పేద ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ వాసవి రక్షణ కవచం పేదలకు ప్రతినెల రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలనుకునే ఆర్యవైశ్యులు ప్రతి నెల రూ. 100 చెల్లించినట్లయితే పేద ఆర్యవైశ్యులకు ప్రతి నెల ఒకరికి సహకారం అందిస్తామని తెలిపారు. సుమారుగా 500 మంది సభ్యులను చేర్చి ప్రతినెల 50 వేల రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవాసవి రక్షణ కవచం సభ్యులు కలకోట లక్ష్మయ్య, తప్పీ గాంధీ, చల్లా సత్యనారాయణ, మిట్టపల్లి రమేష్, దేవరశెట్టి నాగరాజు, సోమా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యులకు సహాయం అందించాలనే ఆలోచనతో ఈవాసవి రక్షణ కవచం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కందిమల్ల మధుసూదన్, కర్నాటి కృష్ణ, నూనె పాండయ్య, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై సర్పంచుల ఆగ్రహం

**రసాబాసగా సర్వసభ్య సమావేశం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ జానయ్య**



పెన్ పహాడ్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) ; పెన్ పహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడి, వేడివేడిగా సాగింది. వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ప్రజా సమస్య లపై తీవ్ర చర్చ జరిగింది. మండలంలోని రాజపేట గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తహసిల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలో నూతన ఆసరా పెన్షన్ల కోసం ఇప్పటివరకు 797 దరఖాస్తులు అందాయని ఎంపీడీవో ఏ జానయ్య తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ మహిళ లకు ఉచిత కుట్టు మిషన్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలం లో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నా యని, రైతాంగాన్ని ఆదుకోవాలని సర్పంచు లు డిమాండ్ చేశారు. సమావేశానికి విద్యుత్ ఏఈ శ్రీనివాస్ హాజరుకాక పోవడంపై సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయన రావాల్సిందేనని పట్టుబట్టారు. చివరికి ఏ ఈ రావడంతో, కరెంట్ కోతలు లేకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడం తో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో పిఏ సి ఎస్ చైర్మన్లు వెన్న సీతారామరెడ్డి, జానకిరామ్ రెడ్డి, డాక్టర్ రాజేష్, డాక్టర్ వెంకన్న, ఎంఈఓ రవి, ఎంపీ ఓ రాజేశ్వర్, ఏపీఓ రవి, ఏపి ఎం అంజయ్య, ఏవో అనిల్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సరిత, ఏఈ లింగయ్య, జాన్ ఫ్రీడ్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# అసెంబ్లీ కార్యక్రమానికి అడ్డంకి..

## బీఆర్ఎస్వీ నేత ముందస్తు అరెస్టు..

**చింతపల్లి, సెప్టెంబర్ 11(జనంసాక్షి)**
చింతపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనకుండా నిరోధించేందుకు బీఆర్ఎస్వీ చింతపల్లి మండల అధ్యక్షుడు ఆరెకంటి మురళిని చింతపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆరెకంటి మురళి పోలీసుల చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టులు, నిర్బంధాల ద్వారా అణచివేయడం సముచితం కాదన్నారు. ప్రజా ఉద్యమాలను పోలీసుల ద్వారా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఎన్ని నిర్బంధాలు, అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని ఆరెకంటి మురళి స్పష్టం చేశారు. ప్రజల తరఫున ప్రశ్నించే స్వరాలను అణచివేయడం సాధ్యం కాదని అన్నారు.. అరెస్టులో సిమర్ల శ్రీను యాదవ్, బిఆర్ఎస్ వి నాయకులు ఉన్నారు.

# నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడి ఆపన్నహస్తం

**వృద్ధురాలి దహన సంస్కారాలకు రూ.10 వేల ఆర్థిక సాయం..**

**సింగపూర్‌లో ఉన్నా స్పందించిన వడత్య రమేష్ నాయక్**



**పి.ఏ.పల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**
పూర్తిస్థాయిలో గూడు,కూడా లేని కడు నిరుపేద కుటుంబంలో వృద్ధురాలు మృతి చెందడంతో ఆ కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు ఆపన్నహస్తం అందించారు. పి.ఏ.పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పోతేం వెంకటేశ్వర్లు( డేవిడ్ ) తల్లి పోతేం మరియమ్మ అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవరకొండ బీఆర్ఎస్ నాయకులు వడిత్య రమేష్ నాయక్ ప్రస్తుతం సింగపూర్‌లో ఉన్నప్పటికీ వెంటనే స్పందించి దహన సంస్కారాల కోసం రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. రమేష్ నాయక్ సూచన మేరకు గణపురం శంకర్, ఇరగదిండ్ల రామకృష్ణల చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులు పోతేం వెంకటేశ్వర్లు (డేవిడ్ ),స్వప్నలకు అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న రమేష్ నాయక్,తాను దూరంగా ఉన్నప్పటికీ వెంటనే సహాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘనపురం శంకర్,పోతేం కృష్ణయ్య, సాయిలు,అంబేద్కర్,శంకర్,విజయ్,వెంకటలచ్చమ్మ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.




**వాటాల వివాదంతో**

# దొంగ బర్ల దందా రట్టు

**ఊళ్లోకి వస్తే కట్టేసి అమ్మేశారు**

**కట్టేసింది నాలుగు విక్రయించింది మూడు**

**మాడుగులపల్లి సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**
మండల పరిధిలోని కుక్కడం గ్రామంలోకి అనాథగా వచ్చిన బర్లను అక్రమంగా బంధించి, అమ్మకానికి పెట్టిన తీరు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది ఎక్కడి నుంచో దారితప్పి ఊరిలోకి వచ్చిన నాలుగు బర్లను దొంగతనంగా ఒక చోట కట్టేసి, అందులో ఇప్పటికే మూడింటిని గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు గ్రామంలో జోరుగా ప్రచారం సాగుతోంది అయితే, ఈ అక్రమ విక్రయాల ద్వారా వచ్చిన సొమ్ము పంపిణీలో గొడవలు జరగడంతోనే ఈ గుట్టు రట్టయినట్లు తెలుస్తోంది వచ్చె సొమ్ములో వాటాలు కుదరక, ముఠా సభ్యుల మధ్య తేడాలు రావడంతోనే ఈ దందాల రచ్చ రంబోలాగా మారినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు ఊర్లోకి వచ్చిన పశువులను కాపాడి యజమానులకు అప్పగించాల్సింది పోయి, ఇలా కట్టేసి అమ్ముకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది ఈ వ్యవహారంలో అసలు సూత్రధారులు ఎవరు, దీని వెనుక ఉన్న పరిణామాలు ఏమిటనే దానిపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# వినాయక ఉత్సవాలకు పర్మిషన్ తప్పనిసరి ఎస్సై సురేష్



**మాడుగులపల్లి సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**
మండలంలో ప్రతిష్టించే గణేష్ విగ్రహాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని మాడుగులపల్లి ఎస్సై సురేష్ స్పష్టం చేశారు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడారు వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం వేళ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తెలిపారు నిబంధనలు ఇవే అనుమతి తప్పనిసరి విగ్రహాల ప్రతిష్టకు ముందస్తుగా పోలీసుల పర్మిషన్ తీసుకోవాలి డీజేలపై పూర్తి నిషేధం నిమజ్జనం ఉత్సవాల సమయంలో డీజేలకు అనుమతి లేదు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు పరిమిత ధ్వని లౌడ్ స్పీకర్లను పరిమిత శబ్దంతో, నిర్ణీత వేళల్లో మాత్రమే ఉపయోగించాలి ప్రశాంత వాతావరణం భక్తిశ్రద్ధలతో, నియమ నిబంధనలకు లోబడి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి అని అన్నారు.

# వలస ఆదివాసీ కుటుంబాలకు షిలోహు మిషనరీ అండ

## ○ 250 కుటుంబాలకు రూ.1.25 లక్షల విలువైన దోమతెరల పంపిణీ



బూర్గంపహాడ్ సెప్టెంబర్ 11 (జనంసాక్షి)
వర్షాకాలంలో దోమల బెడదతో విషజ్వరాల బారిన పడుతున్న వలస ఆదివాసీ కుటుంబాలకు 'షిలోహు మిషనరీ మినిస్ట్రీస్' అండగా నిలిచింది. సంస్థ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని వలస ఆదివాసీ కుటుంబాలకు రూ.1.25 లక్షల విలువైన దోమతెరలను పంపిణీ చేశారు. బూర్గంపహాడ్ మండలం సారపాకలోని గాంధీనగర్ సీయోను ప్రార్థనా మందిరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ములుగు జిల్లా తాడ్వాయి, మంగపేట, ఏటూరునాగారం మండలాల్లోని శాంతినగర్, కేఎం నగర్, ఎర్రకుంట ప్రాంతాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మలకలపల్లి మండలంలోని పాత గుండాలపాడు, పాలవాగు తదితర ప్రాంతాల్లో సేవలందిస్తున్న పాస్టర్లకు దోమతెరలను అందజేశారు. షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ మోజేస్ ములక చేతుల మీదుగా ఈ పంపిణీ జరిగింది. అదేవిధంగా పాలవాగు గ్రామంలోని వలస ఆదివాసీ విద్యార్థులకు పలకలు, బలపాలను కూడా పాస్టర్ మోజేస్ ములక అందజేశారు.

**- క్రీస్తు ప్రేమను పంచడమే లక్ష్యం..**

ఈ సందర్భంగా పాస్టర్ మోజేస్ ములక మాట్లాడుతూ, లోక రక్షకుడైన క్రీస్తు యేసు ప్రేమను ప్రతి ఒక్కరికీ పంచాలనే ఉద్దేశంతో వలస ఆదివాసీ కుటుంబాలకు దోమ తెరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు వర్షాకాలంలో దోమల బెడదతో డెంగ్యూ, మలేరియా తదితర జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా దోమ తెరలను అందించినట్లు పేర్కొన్నారు. వలస ఆదివాసీ కుటుంబాలు తమ పిల్లలను చిన్ననాటి నుంచే చదివించాలని, విద్య ద్వారానే కుటుంబాల జీవన ప్రమాణాల్లో స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పిల్లల చదువును మధ్యలో ఆపకుండా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షిలోహు మిషనరీ బృందం సభ్యులు పాస్టర్ పెద్దారావు, పాస్టర్ టి.ఎం. కుమార్, ఏరియా ఇన్‌చార్జులు పాస్టర్ ఇర్ఫాపాల్, పాస్టర్ బెంజిమెన్, పాస్టర్ రత్నకుమార్, పాస్టర్ స్టీవెన్ బాబు, బ్రదర్ ఇమ్మానియేల్, బ్రదర్ మోతుకూరి విజయ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలి

### సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

**ములకలపల్లి సెప్టెంబర్ 11 జనంసాక్షి :**
మూకమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిరాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులకు, బాలింతలకు, తల్లులకు పోషణ ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహారం యొక్క పోషక విలువలను తెలియజేశారు. ప్రతి గర్భవతి ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ఒక పూట సంపూర్ణ భోజనం తీసుకోవాలని, గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషకాహారం, గుడ్లు, పాలు వంటివి తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సామ్రాజ్యం, ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర లలిత, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, రాధ, విజయ, రమాదేవి, వసంత, సునీతబాలింతలు, గర్భిణి స్త్రీలు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల నిరసన హోరు

**○కేటీపీఎస్ సీఈ ఆఫీస్ ఎదుట భారీ ధర్నా**

**○ప్రైవేటీకరణ టెండర్లు రద్దు చేయాలని డిమాండ్**

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**
వై.టి.పి.ఎస్ (వైటీపీఎస్) కోల్, యాష్ హ్యాండ్లింగ్ పనుల ప్రైవేటీకరణ టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) ఆధ్వర్యంలో కేటీపీఎస్ 5, 6వ దశల ఉద్యోగులు శుక్రవారం పాల్వంచ పట్టణంలోని చీఫ్ ఇంజనీర్ మేకా ప్రభాకరరావు కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగులు సీఈ కార్యాలయ ప్రాంగణంలో నేలపై కూర్చొని మేనేజ్‌మెంట్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గత నెల 29న జరిగిన జాయింట్ మీటింగ్‌లో ప్రభుత్వం, యాజమాన్యంతో చర్చించి 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గురుచేశారు. అయితే, ఆ హామీకి విరుద్ధంగా మేనేజ్‌మెంట్ నిబంధనలను పక్కనబెట్టి ప్రైవేటీకరణ టెండర్లను ఫైనలైజ్ చేస్తూ 'ఫినార్మెక్' కంపెనీకి 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' ఇచ్చేందుకు సిద్ధపడటం దారుణమని మండిపడ్డారు. యాజమాన్యం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జనరేటింగ్ స్టేషన్ల చీఫ్ ఇంజనీర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డి. ఉమామహేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, సీహెచ్. భాగ్యరాజ్, అష్రఫ్, షరీఫ్, కోటేశ్వరరావు, పుల్లారావు, సురేంద్రాచారి, రాధాకృష్ణ, యాదగిరి, రాజాబాబు, రజిత, రిజ్వానా, నాగేశ్వరరావు, రాముదాసు తదితర నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

**చంద్రుగొండ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**
జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బెండలపాడులోని అమరవీరుడు స్వర్గీయ చలమల శ్రీనివాసరావు స్మృతి వనంలో స్మారక స్థూపం వద్ద శుక్రవారం చంద్రుగొండ ఎఫ్ఆర్ఓ తేజస్వి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చలమల శ్రీనివాసరావు అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన సేవలను స్మరించుకొని కొనియాడారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అటవీ సంపదను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తేజస్వి అన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## 56 మందికి టీబీ పరీక్షలు..

# 7 మంది అనుమానితుల గుర్తింపు

**○పెద్దరెడ్డిగూడెంలో 'టీబీ ముక్త భారత్ అభియాన్' ఉచిత వైద్య శిబిరం**

**○మొబైల్ ఎక్స్‌రే ద్వారా గ్రామస్థులకు వైద్య పరీక్షలు**

**అన్నపురెడ్డిపల్లి సెప్టెంబర్ 11 జనంసాక్షి**
దేశాన్ని క్షయరహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'టీబీ ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పెద్దరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ భవనంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మొబైల్ ఎక్స్‌రే శిబిరాన్ని గ్రామ ఉప సర్పంచ్ వేముల నరేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

అత్యాధునిక పోర్టబుల్ డిజిటల్ మొబైల్ ఎక్స్‌రే పరికరం ద్వారా గ్రామస్థులకు ఉచితంగా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. మొత్తం 56 మందికి పరీక్షలు నిర్వహించగా.. 7 మంది టీబీ అనుమానితులను గుర్తించారు. అనుమానితులకు తదుపరి దశలో కళ్లె (స్పుటం) పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

**లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయొద్దు**

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ( సిహెచ్ఓ ) వాణి మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో స్వల్ప జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా చికిత్స, మందులు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా టీబీ రోగులకు పౌష్టికాహార సహాయం అందించేందుకు 'నిక్షయ్ పోషణ్ యోజన' ద్వారా ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేస్తుందని వివరించారు.

**ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

గ్రామ ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ వేముల నరేష్



కోరారు. టీబీ లక్షణాలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలోనే గుర్తించి నియంత్రించవచ్చని తెలిపారు. లఈ కార్యక్రమంలో సిహెచ్ఓ వాణి, హెల్త్ ఎడ్యుకేటర్ జయలక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ వెంకట్, మొబైల్ ఎక్స్‌రే టెక్నీషియన్ సాయికృష్ణ, హెల్త్ అసిస్టెంట్ రామదాసు, ఆశా కార్యకర్తలు వెంకటలక్ష్మి, లక్ష్మి, విజయలక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు జిల్లాల కాంగ్రెస్ అధికార ప్రతినిధి గా మానవతారాయ్



**కల్లూరు సెప్టెంబర్ 11(జనంసాక్షి)**
తెలంగాణరాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు ఎంపీ,టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్, చామల కిరణకుమార్ రెడ్డి పలు జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులను నియమించడం జరిగింది. దీనిలో భాగంగా వరంగల్ హనుమకొండ రెండు జిల్లాల కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఇన్చార్జిగా కల్లూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కోటూరి మానవ తారాయ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కోటూరి మానవతారాయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి దశ లో ఎన్ ఎస్ యు ఐ లో, తదుపరి యువజన కాంగ్రెస్ లో, అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా సుదీర్ఘంగా చురుకైన పాత్ర పోషించి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం , ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంటూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ పిలుపుమేరకు అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు యువతకు విద్యార్థిలోకానికి అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నానని తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు ఆది నుంచి కష్టపడుతున్న తన సేవలను గుర్తించి తనను వరంగల్ హనుమకొండ జిల్లాల అధికార ప్రతినిధి ఇన్చార్జిగా నియమించటం జరిగిందని తెలిపారు. తనపై ఉంచిన గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతం కోసం విస్తృతంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. తన నియమాకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఎంపీ సీఎం ముఖ్య సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కల్లూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కోటూరి మానవతారాయ్ ను రెండు జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఇన్చార్జిగా నియమించడం పట్ల పలువురు అభిమానులు , మిత్రులు శ్రేయోభిలాషులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

# మోటార్ కార్మికులకు వేతనాలు పెంచాలి

## మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు



**టేకులపల్లి,సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** కోయగూడెం ఓపెన్ కాస్ట్ నుండి కొత్తగూడెం కోల్ రవాణా చేస్తున్న కోల్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లకు క్లీనర్లకు వేతనాలు పెంచాలని, బోనసు వెంటనే చెల్లించాలని మోటర్ వర్కర్స్ యూనియన్( ఐఎఫ్టియు) రాష్ట్ర అధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి డి మోహన్ రావు లు అన్నారు. కోల్ ట్రాన్స్పోర్ట్, డ్రైవర్లతో శుక్రవారం టేకులపల్లి లో జనరల్ బాడీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్పోర్ట్ యాజమాన్యం డ్రైవర్, క్లీనర్ వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యం వహిస్తుందని, నిర్లక్ష్యాన్ని విడనాడి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.ఒప్పందంలో భాగంగా సంవత్సరం డ్యూటీలు పూర్తి చేసుకున్న కార్మికులకు తక్షణమే బోనసు చెల్లించాలని డిమాండ్ చేశారు.లేనియెడల మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు సమ్మెలోకి దిగుతారని దానికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో ప్రశాంత్, రమణయ్య, నేపాల్, రాజేష్ , చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సమితి సభ్యుడిగా అనుముల సాయి



**ములకలపల్లి సెప్టెంబర్ 11 జనంసాక్షి :**
యాదగిరిగుట్టలో జరిగిన ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఒఎజఈ) మూడవ తెలంగాణ రాష్ట్ర మహాసభలలో ఒఎజఈ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యకుడు అనుముల సాయి ను రాష్ట్ర సమితి సభ్యుడుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేస్తున్నారని ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసం చేస్తుందని అన్నారు. నాపై నమ్మకంతో రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు కు, సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.




## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

### ప్రకృతి సిద్ధమైన విగ్రహాలతో అలరించిన విద్యార్థులు..

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్11 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచపట్టణంలోని ఒడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఆకులు, బంకమట్టి, వివిధ రకాల ధాన్యాలు, పప్పుధాన్యాలు, గోధుమ పిండితో స్వయంగా తయారు చేసిన వినాయక ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి మాట్లాడుతూ గణేష్ చతుర్థి జ్ఞానానికి, శ్రేయస్సుకు మరియు అభ్యుదయానికి చిహ్నమని తెలిపారు. హిందూ క్యాలెండర్ ప్రకారం భాద్రపద మాసంలో నాల్గో రోజు చతుర్థి ప్రారంభమవుతుందని వివరించారు. వినాయకుడు అడ్డంకులను తొలగించే "విఘ్నహర్త" అని, "గణ" అంటే సమూహం, "పతి" అంటే ప్రభువు అని పేర్కొన్నారు. ఏ శుభకార్యం ప్రారంభించినా విఘ్నాలు కలగకుండా ఉండాలని మొదట వినాయకుడినే పూజిస్తారని గుర్తుచేశారు.కొత్తగూడెం జోన్ ఏజీఎం వీరన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వినాయకుడు బుద్ధి, ప్రజ్ఞ మరియు జ్ఞానానికి అధిపతి అని కొనియాడారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే గణనాథుడిని మట్టి విగ్రహాల రూపంలోనే పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో ప్రైమరీ ఇన్చార్జ్ మహమ్మద్ సిరాజ్ బేగం, పి.పి.టి ఇన్చార్జ్ బండారు శిరీష మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలపై తాసిల్దార్ వీరభద్ర నాయక్ మండలాధికారులతో సమీక్ష సమావేశం

పెనుబల్లి,సెప్టెంబర్11 (జనంసాక్షి)
ఈనెల 14న వినాయకచవితిసందర్భంగాపెనుబల్లి మండల వ్యాప్తంగా జరగనున్న గణేష్ నవరాత్రుల ఉత్సవాల నిర్వహణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల అధికారులతో శుక్రవారం తాసిల్దార్ వీరభద్ర నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూపెనుబల్లి మండలం లోని గ్రామపంచాయతీల లో విగ్రహాల ఏర్పాటు నుండి నిమజ్జనం జరిగే సమయం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, విద్యుత్ నీటిపారుదల, పోలీస్, గ్రామపంచాయతీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పెద్ద పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నిమజ్జనానికి విగ్రహాలు తరలించే సమయంలో విద్యుత్ తీగలు, నిమజ్జన ప్రదేశాలను సంబంధిత శాఖ అధికారులు పూర్తి పర్యవేక్షణ అవసరమన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా పోటాపోటీగా నిర్వహిస్తున్న గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే వ్యక్తులను ముందస్తుగ గుర్తించడం ద్వారా అక్కడ శాంతియుతంగా ఉత్సవాలు జరిగే అవకాశం ఉందన్నారు . నిమజ్జన ప్రదేశాల్లో విగ్రహం వెంట ఈత వచ్చిన వ్యక్తులు మాత్రమే అనుమతించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వినాయక నిమజ్జన సమయంలో డీజే సౌండ్ సిస్టం కు అనుమతులు లేవని, డీసెలను వినియోగించే వారిపై కేసు నమోదు చేస్తామని వీఎం బంజర్ ఎస్ఐ షాకీర్ హెచ్చరించారు, వినాయక చవితి వేడుకలను ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మండల ప్రజానీకాన్ని తాసిల్దార్, ఎస్ ఐ కోరారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.





## పెనుబల్లి గ్రామపంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెనుబల్లి సెప్టెంబర్ 11 (జనంసాక్షి)
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పెనుబల్లి గ్రామపంచాయతీ రేషన్ షాప్ వద్ద జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాణోత్ పాపాలక్ష్మి, జి పి ఓ వాంకడోత రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు వనజ,చిలుకు బత్తుల చెన్నారావు, జిల్లెళ్ల నరసింహాస్వామి, మల్లెల రాజ, బొర్రా బాబు,అన్నపురెడ్డి లక్ష్మయ్య, మద్దెల వెంకయ్య,తదితరులు పాల్గొన్నారు.

### బెండాలపాడులో డిజిటల్ రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ



**చంద్రుగొండ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**
మండలంలోని బెండాలపాడు గ్రామంలోని జీసీసీ రేషన్ షాపులో శుక్రవారం నూతన డిజిటల్ రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, స్థానిక సర్పంచ్ బొర్రా లలిత, ఉప సర్పంచ్ బానోత్ బాలు లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీసం రాములు, మాజీ ఎంపీటీసీ కారం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లం కృష్ణయ్య, గ్రామ సేవాదళ్ అధ్యక్షుడు ఆంగోత్ రమేష్, అజ్మీరా రమేష్, రావిళ్ల సాయిబాబు, రాయల నరేష్, వార్డు సభ్యులు తేజావత్ బాబు, కణితి సీతరత్నం, జీసీసీ సేల్స్మన్ పోడియం రవి తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## ఈ నెల15న హైదరాబాదులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**టేకులపల్లి, సెప్టెంబర్ 11(జనంసాక్షి):**
హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగే రాష్ట్ర సదస్సును హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కు సారంగపాణి,ఐఎఫ్ టియు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం టేకులపల్లి మండలం తుమ్మల చెలక గోదాము, మురుట్ల గ్రామంలో సదస్సు ప్రచార పోస్టర్లను ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్లు, గోదాములు, రైస్ మిల్లులు,సిమెంటు, ఎరువుల గోదాములు, పరిశ్రమలు,ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే వేలాది మంది హమాలీ కార్మికులు నేటికీ చట్టబద్ధమైన హక్కులు,రక్షణ లేకుండా పనిచేస్తున్నారని అన్నారు హమాలీలు నిత్యం బరువులు మోయడం వల్ల అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం హమాలీ లకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాల ని,చట్టబద్ధమైన హక్కులు,సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,50 సంవత్సరాల వయస్సు దాటిన హమాలీలకు నెలకు 10వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని,ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి మేకల వినోద్, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు తోడేటి నాగేశ్వరరావు, నాయకులు డి.మోహన్ రావు,మహేష్,సురేష్,శ్రీరాములు, బన్సి, రవి,బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

## వరి బోనస్ ఆన్‌లైన్ నమోదు గడువు

# సెప్టెంబర్ 17 వరకు పొడిగింపు

**ములకలపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ప్రభుత్వం నిర్ణయించిన వరి రకాలైన తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), సాంబా మసూరి (బీపీటీ 5204), కేఎన్ఎం 1638, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాలను సాగు చేస్తున్న రైతులు తమ పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసు కోవాలని మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, విత్తనాల కొనుగోలు బిల్లు తీసుకుని, విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద పంట వివరాలను నమోదు చేసుకోవా లని సూచించారు. సొంత విత్తనం లేదా ఇతర రైతుల నుంచి పొందిన విత్తనాలను వినియోగి స్తున్న రైతులు రైతు ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత వివరాలను తమ పరిధిలోని వ్యవ సాయ విస్తరణ అధికారికి (ఏఈఓ) సమర్పించా లని తెలిపారు. నమోదు చేసిన పంట వివరాలను పౌర సరఫరాల శాఖకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోర్టల్‌లో నమోదు చేసుకున్న రైతులు మాత్రమే క్వింటాలుకు రూ.500 చొప్పున వరి బోనస్ పొందేందుకు అర్హులవుతారని తెలిపారు. ములకలపల్లి మండలంలో వరి సాగు చేస్తున్న రైతులందరూ సెప్టెంబర్ 17లోపు తమ పంట వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.

## బైక్-డీసీఎం ఢీకొని యువకుడు మృతి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 11(జనంసాక్షి)** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్‌గేట్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన నోముల నాగమ్మ, మల్లయ్యల చిన్న కుమారుడు నోముల దీపక్ (22) హైదరాబాద్‌లో కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సెప్టెంబర్ 10వ తేదీ రాత్రి దీపక్ తన స్నేహితులైన దున్నపోతుల శ్రీకాంత్ , చీమ ఉదయ్ లతో కలిసి బైక్‌లపై స్వగ్రామానికి బయలుదేరారు. దీపక్, శ్రీకాంత్‌లు బైక్‌పై వెళ్తుండగా, ఉదయ్ మరో బైక్‌పై వారిని అనుసరిస్తున్నాడు. రాత్రి సుమారు 9:20 గంటల సమయంలో పంతంగి టోల్‌గేట్ సమీపంలోకి రాగానే, వీరి ముందు వెళ్తున్న ఒక గుర్తుతెలియని డీసీఎం వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేసింది. దీంతో వేగంగా వస్తున్న బైక్ కంట్రోల్ కాక డీసీఎంను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దీపక్ తల డీసీఎం వెనుక ఉన్న హుక్‌కు గుచ్చుకోవడంతో తల పగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెనుక కూర్చున్న శ్రీకాంత్ తీవ్ర గాయాలయ్యాయి. వెనుక వస్తున్న ఉదయ్ కూడా బైక్ కంట్రోల్ కాక కిందపడటంతో స్వల్ప గాయాలపాలయ్యాడు. ఉదయ్ సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అంబులెన్స్‌లో బాధితులను చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాంత్‌ను హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మృతుని తల్లి నాగమ్మ ఆసుపత్రికి చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.నర్సిరెడ్డి తెలిపారు.

## చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి

**○ జిల్లా అధ్యక్షులు పసుమర్తి సీతా చంద్రరావు**



**ఖమ్మం, (జనంసాక్షి) :** ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు ఉప్పల్ భగాయత్ లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయాల చారిత్రాత్మక నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం, శ్రీనివాస కళ్యాణం జరుగుతుంది. తదనంతరం ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వి చేయుచున్నారు. కావున ఈ సమావేశానికి మన ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య బంధు మిత్రులందరూ తప్పక విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి సీతాచంద్రరావు కోరారు. ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, మండల కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాలు యువజన సంఘం, మహిళా సంఘం, సేవాదళ్, రాజకీయ విభాగం, విద్యా కమిటీల సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షులు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శులు, మాజీ జిల్లా కోశాధికారులు అందరూ తప్పకుండా హాజరు కావాల్సిందిగా పసుమర్తి కోరారు.

## పిఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ విఎం బంజర్‌లో

# విద్యార్థులకు ప్రాక్టికల్ రోబోటిక్స్ వర్క్ షాప్



**పెనుబల్లి, సెప్టెంబర్10 (జనంసాక్షి)** పెనుబల్లి మండలం వి.ఎం బజర్ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం.సత్యనారాయణ, అటల్ టింకరింగ్ ఇంచార్జ్ బండి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ కు చెందిన రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్ (ఆర్ఐఏ) ఏడీఎం సహకారంతో ఒక రోజు ప్రాక్టికల్ రోబోటిక్స్ వర్క్ షాప్ నిర్వహించారు. వర్క్ షాప్ ద్వారా పాఠశాలలో తొలిసారిగా రోబోటిక్స్ క్లబ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రాక్టికల్ రోబోటిక్స్ విద్యను పరిచయం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు రోబోటిక్స్ యొక్క ప్రాథమిక అంశాలు, ఎలక్ట్రానిక్స్, సెన్సర్లు, మోటార్లు,సర్క్యూట్ బిల్డింగ్,రోబోటిక్స్ పార్ట్స్, వినియోగం వంటి అంశాలపై ప్రత్యక్ష శిక్షణ అందించారు. విద్యార్థుల స్వయంగా సర్క్యూట్ రూపొందించడం, రోబోటిక్ మోడల్ ను నిర్మించడం,వివిధ ప్రాక్టికల్ యాక్టివిటీస్ లో పాల్గొనడం ద్వారా సాంకేతిక నైపుణ్యాలను అవగాహన చేసుకున్నారు. వర్క్ షాప్ ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాలలో రోబోటిక్స్ కార్యకలాపాలు నిరంతరం కొనసాగేందుకు రోబోటిక్స్ ప్రాక్టీస్ కిట్ ను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో ట్రైనర్ అరవింద్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకల నిర్వహణపై

## సమన్వయ సమావేశం

**కల్లూరు సెప్టెంబర్ 11(జనంసాక్షి)** కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అధ్యక్షతన వినాయక చవితి వేడుకల నిర్వహణపై సంబంధిత డివిజన్ స్థాయి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, పరస్పర సమన్వయం, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం గణేష్ ఉత్సవాల్లో

## మట్టి విగ్రహాలను పూజించండి



**కల్లూరు సెప్టెంబర్ 11 (జనంసాక్షి)** వినాయక చవితి నీ పురస్కరించుకొని గణేష్ ఉత్సవాలు నిర్వహించే మండపాల నిర్వాకులు , భక్తులు పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహా లను ప్రతిష్టించి ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమా లు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలని కల్లూరు ఎస్సై డి హరిత సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఇతరు లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాలను పురస్కరించు కుని శుక్రవారం ఆమె మండల ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు పలు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రతి గణేష్ మండప నిర్వాహకులు ముందస్తుగా ఆన్లైన్లో మండపాల వివరాలను నమోదు చేసుకుని కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా నాణ్యమైన వైర్లు మాత్రమే ఉపయోగించాలి. అగ్నిప్రమాదాల నివారణకు తప్పనిసరిగా ఇసుక బకెట్లు, నీటి వసతి అందుబా టులో ఉంచుకోవాలి. ప్రతి మండపం వద్ద రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటల పాటు కనీసం ఇద్దరు లేదా ముగ్గురు వాలంటీర్లు కాపలాగా ఉండాలి. రాత్రి 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లౌడ్ స్పీకర్లు, డీ జే లు వినియోగించరాదు. ముందుగా నిర్ణయిం చిన మార్గాల్లోనే నిమజ్జన శోభాయాత్రలు ప్రశాంతంగా కొనసాగాలి. మద్యం సేవించి వాహనాలు నడపడం, అల్లర్లకు పాల్పడటం వంటివి చేయకూడదు. ప్రజా సంక్షేమం, భద్రతకు విఘాతం కలిగించేలా ఎవరైనా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితు ల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్ఐ డి.హరిత స్పష్టం చేశారు. ఉత్సవాల ముసుగులో నిబం ధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మె



**ఖమ్మం కార్పొరేషన్ సెప్టెంబర్ 11 (జనంసాక్షి)** దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో పనిచేస్తున్న సుమారు 8 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు ఒకరోజు సమ్మె చేపట్టారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని పొట్ల వెంకటాలయ ప్రాంతంలో బ్యాంకు ఉద్యోగులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్యాంకు ఉద్యోగుల ప్రధాన డిమాండ్ 5 రోజుల పని వారాన్ని వెంటనే అమలు చేయాలనేది. ఇప్పటికే బ్యాంకు యాజమాన్యాలు, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ దీనికి అంగీకరించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి రావడం లేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ రంగాల్లో శనివారం, ఆదివారం సెలవులు ఉండగా, బ్యాంకు ఉద్యోగులకు మాత్రమే నెలలో రెండు శనివారాలు మాత్రమే సెలవు ఉండటం అన్యాయమని వారు వాదిస్తున్నారు. వారి రెండవ ప్రధాన డిమాండ్ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన స్కీమ్ ను ఉపసంహరించుకోవాలని. ఈ స్కీమ్ లో తీవ్ర వివక్ష ఉందని, ఇది ఉద్యోగుల మధ్య చీలిక తెచ్చే విధంగా ఉందని ఆరోపిస్తున్నారు. స్కీమ్ ను రూపొందించే ముందు యూనియన్లతో ఎలాంటి చర్చలు జరపలేదని, ఇది ద్వైపాక్షిక ఒప్పందాలకు విరుద్ధమని నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఒకరోజు సమ్మె కేవలం హెచ్చరిక మాత్రమేనని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో మూడు రోజుల నిరవధిక సమ్మెకు, అక్టోబర్ 26 నుండి పూర్తిస్థాయి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ సమ్మెలో అనే ఏడు యూనియన్లు ఐక్యంగా పాల్గొన్నాయి.

## పెద్దతండా పరిధిలో నేడు విద్యుత్

## సరఫరాకు అంతరాయం

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 11(జనంసాక్షి)** 33/11 కేవీ పెద్దతండా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ జలగం నగర్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఏఈ జె. ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ 12న ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయం కారణంగా బిషప్ హౌస్ ఏరియా, సాయి ప్రభాత్‌నగర్, నాయుడుపేట, లంబినివనం, అభయ్ టౌన్‌షిప్, కేబీఆర్ నగర్‌తో పాటు సంబంధిత పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం



సూర్యాపేట (జనంసాక్షి):శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, దళితులు ఉన్నత పదవుల్లోకి ఎదగడాన్ని ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్, పీసీసీ అధికార ప్రతినిధి దూదెం వెంకటరమణ, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ అన్నారు.శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రెడ్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులను కించపరిచేలా మాటాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు దళితులపై ఏనాడూ నిజమైన ప్రేమ లేదని, రాజ్యాంగపరంగా అమలులో ఉన్న రిజర్వేషన్లను అమలు చేయడం తప్ప దళితుల సంక్షేమం, సాధికారత కోసం చేసిందేమీ లేదని విమర్శించారు.గతంలో మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఆయనకు సమాన హోదా, గౌరవం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రతిపక్ష హోదా కల్పించలేదని ఆరోపించారు. ప్రస్తుతం గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభ స్పీకర్‌గా ఉన్న నేపథ్యంలో ఆయనను గౌరవిస్తూ అధ్యక్షా అని సంబోధించాల్సి వస్తుందనే కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారని అన్నారు.ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభ సమావేశాలకు హాజరుకాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం సరికాదన్నారు.శాసనసభలో ప్రజా సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉన్నప్పటికీ దాన్ని వినియోగించుకోకుండా బీఆర్ఎస్ నాయకులు సభ వెలుపల గందరగోళం సృష్టిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే అది శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఉండాలని సూచించారు.రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం, సామాజిక వర్గాలను కించపరిచే వ్యాఖ్యలకు రాజకీయాల్లో తావివ్వకూడదన్నారు .స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



## వినాయక చవితి మండపాలకు పోలీస్ వారి అనుమతి తప్పనిసరి

**- డీజే లకు అనుమతి లేదు - ఎస్సై చలికంటి నరేష్**

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) : వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా పొందాలని హుజూర్‌నగర్ ఎస్సై చలికంటి నరేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వాహకులతో ఎస్సై మాట్లాడుతూ రోడ్లపై ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ కోసం అధికారుల అనుమతి పొందాలని సూచించారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, పాటలు, డీజే సౌండ్ సిస్టమ్‌కు ఎటువంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. మండపాల వద్ద గొడవలు జరిగితే కమిటీ వారే బాధ్యులవుతారని, కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. ఉత్సవాల ఏర్పాట్ల విషయంలో పీర్లకొట్టం, నిమ్మతోట బజారుకు చెందిన ఇరువర్గాల 13 మంది యువకుల మధ్య పంచాయితీ జరగడంతో తహసీల్దార్ సమక్షంలో వారిపై బైండోవర్ విధించినట్లు తెలిపారు. ఉత్సవాలు పండుగ వాతావరణంలో జరుపుకోవాలని, ఏదైనా ఇబ్బందులు తలెత్తితే పోలీసు వారికి సమాచార ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ మండపాల వద్ద కనీసం నలుగురు కమిటీ సభ్యులు ఉండాలని సూచించారు.

## ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణంపై స్థానికుల ఆందోళన

**-నిర్మాణం వెంటనే నిలిపివేయాలి -మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌కు వినతి**



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) : పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఎదురుగా నిర్మిస్తున్న ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని స్థానికులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి, నివాస ప్రాంతానికి సమీపంలో టవర్ వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సతీష్ లకు లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణం గురించి కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా "మాకు అన్ని అనుమతులు ఉన్నాయి, పనులు ఆపేది లేదు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## బీఎల్ఓలకు గౌరవ వేతనం ఇవ్వాలి: సీఐటీయూ డిమాండ్

**తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన బీఎల్ఓలు**

**బీఎల్ఓల వెట్టిచాకిరికి చెక్ పెట్టాలి - ఎస్.కె. యాకూబ్**

గరిడేపల్లి, సెప్టెంబర్ 11(జనం సాక్షి): బీఎల్ఓ లకు నెలకు రూ.20 వేల గౌరవ వేతనం ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గరిడేపల్లి తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.కె. యాకూబ్ మాట్లాడుతూ 2013 నుండి ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ సేవలందిస్తున్న బీఎల్ఓలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ఆరోపించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన బీఎల్ఓలు రోజుకు 12 గంటలు డ్యూటీ చేస్తూ రాజకీయ ఒత్తిళ్ల మధ్య పని చేస్తున్నారని, మొదట్లో నామమాత్రంగా రూ.1000-1500 ఇచ్చి ఇప్పటి వరకు పెంపు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నెలకు రూ.20 వేల వేతనం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రావుల వెంకన్న, ఎం. ఉమా, సైదమ్మ, ఎస్. నర్సిరెడ్డి, జయమ్మ, పద్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





## విఓఏ ల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

**- సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్**

గుర్రంపోడు, సెప్టెంబర్ 11, (జనంసాక్షి) గుర్రంపోడు మండలంలో విఓఏ (గ్రామ సంఘ సహాయకులు)లకు బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల మహిళా సమైక్య కార్యాలయం ముందు బకాయి వేతనాల కోసం విఓఏలు చేపట్టిన మెరుపు సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఎం.ఎస్ మీటింగ్‌కు రాలేదనే నెపంతో పది మందికి మూడు నెలల వేతనాలను ఏపీఎం నిర్లక్ష్యంతో ఆపేశారని మండిపడ్డారు. సీసీల నిర్లక్ష్యం వల్ల మరికొన్ని క్లస్టర్లలో గ్రేడింగ్ నమోదు చేయకపోవడంతో మొత్తం 78 మంది విఓఏలకు సంబంధించిన రూ. 3 లక్షల 90 వేల వేతనాలు నిలిచిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రూ. 5 వేల స్వల్ప వేతనంతో ఎన్నో కష్టాలకు ఓర్చి పనిచేస్తున్న వి.ఓ.ఏల జీతాలను అధికారులు రకరకాల కారణాలతో ఆపితే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఏపీఎం, సీసీల నిర్లక్ష్యం వల్ల విఓఏలకు జీతాలు రావడం లేదని, వీరిని వెంటనే ఈ మండలం నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యపై సీసీలు, ఏపీఎంలతో పాటు పీడీకి వినతిపత్రం ఇచ్చి నెల రోజులు గడిచినా ఇప్పటివరకు సరైన స్పందన లేదని, గత్యంతరం లేకే విఓఏలు సమ్మెకు దిగారని లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఇప్పటికైనా పీడీ చొరవ తీసుకుని వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని, లేకపోతే మండల వ్యాప్తంగా 'పెన్ డౌన్' కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర సిఐటియు కార్యవర్గ సభ్యులు పగిడిమర్రి సర్వయ్య, యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సల్వాది సైదమ్మ, ఆదిరాల లక్ష్మి, నాయకులు వడ్లమల్ల యాదయ్య, బొంగరాల రుద్రమ్మ, రజిత, కవిత, యాదమ్మ, నాగమణి, మంజుల, పుష్ప, ప్రశాంతి, రేణు శ్రీ, సునీత, వెంకటమ్మ, విమల తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**తహసిల్దార్ ను సన్మానించిన కట్ట మల్లారెడ్డి**



నూతనకల్ సెప్టెంబర్ 11 (జనంసాక్షి) మండల కేంద్రంలోని నూతనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో తుంగతుర్తి ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,తహసిల్దార్ పి శ్రీనివాసరావు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ రేషన్ కార్డులు పేదలకు వరం అని ప్రతి పేద కుటుంబానికి ప్రతి మనిషికి ఉచితంగా ఆరు కిలోల సన్న బియ్యం ఈ స్మార్ట్ కార్డుల ద్వారా అందుతున్నాయని వారు తెలిపారు.దేశ్ముకుల భూములు పట్టాలు కాక ఎన్నో ఏళ్ల నుండి ఎదురుచూస్తున్న రైతుల కళ్ళలో వెలుగులు నింపి సీలింగ్ భూముల పట్టాలు రావడానికి విశేష కృషిచేసిన తహసిల్దార్ శ్రీనివాసరావు ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి, మండల రైతుల పక్షాన వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి,ఎంపీడీవో సునీత, సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 11 (జనంసాక్షి) తిమ్మాపురం ఎంపీపీ ఎస్ లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పాతులోతు రాములను శుక్రవారం ఎంఈఓ.బి.బాలునాయక్ బొద్దు ఇందిరా సోమరాజులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వి.లింగమ్మ, కాంప్లెక్స్ హెచ్ఎం నరసయ్య, ఉప సర్పంచ్ సందీప్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, శోభ, మల్లికార్జున్, విజిత, శోభ, సురభి శేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



# రేషన్ డీలర్.. సర్పంచ్ భజనలో బిజీ!

- ◆ప్రజలకు రేషన్ పంచాల్సిన డీలర్.. రాజకీయ ప్రచారంలో హల్‌చల్
- ◆సోషల్ మీడియాలో 'వీరుడు.. సూర్యుడు' అంటూ ప్రచారం
- ◆"వెనుక సర్పంచ్ ఉన్నాడు.. ఏం కాదు" అంటూ ధీమా?
- ◆డీలర్ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం.. చర్యలకు డిమాండ్




మర్రిగూడ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) పేదలకు రేషన్ సరుకులు అందించాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న రేషన్ డీలర్ వ్యవహారశైలి ఇప్పుడు గ్రామంలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. రేషన్ పంపిణీ కంటే గ్రామ సర్పంచ్ సేవలోనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ డీలర్‌గా ప్రభుత్వ నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాల్సిన వ్యక్తి.. సర్పంచ్‌కు అనుకూలంగా రాజకీయ ప్రచారానికి దిగడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో సైతం సర్పంచ్‌ను ఆకాశానికెత్తుతూ "వీరుడు.. సూర్యుడు" అంటూ పోస్టులు పెట్టడం, స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో వాటిని ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది. డీలర్ తీరుపై గ్రామంలో మరో ఆరోపణ వినిపిస్తోంది. తన వెనుక సర్పంచ్ అండదండలు ఉన్నాయనే ధీమాతో నిబంధనలను లెక్కచేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఏం జరిగినా తనకు రాజకీయ అండ ఉందనే భావనతో వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రేషన్ డీలర్ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారా? సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం పిడిఎస్ నిబంధనలకు విరుద్ధమా? అనే అంశాలపై అధికారులు విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజలకు రేషన్ పంచాల్సిన డీలర్.. సర్పంచ్ భజనలో మునిగితేలడం ఎంతవరకు సమంజసం? పదవి ప్రజాసేవ కోసమా.. రాజకీయ సేవ కోసమా? అధికారులు స్పందిస్తారా.. చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాల్సిందే.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విభాగం ఎన్నికలు : జిల్లా కలెక్టర్ అంకిత్

నిర్వహించేందుకు ప్రత్యేకంగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిణి (సీ.పీ.ఓ)సునీత ను నియమించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 2563 మంది సభ్యులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో ఉన్నారని, ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. ఈ ఎన్నికలు ఓటర్ లిస్టు ఈనెల 14వ తేదీ నుంచి జిల్లా అధికారుల వద్ద ఉంటుందని, ఏటువంటి అభ్యంతరాలు ఉన్న లిఖిత పూర్వకంగా అందజేయాలని తెలిపారు. ఓ ఓటర్ల జాబితాలో ఏదైనా తప్పులు, ఒప్పులు ఉంటే 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను తెలంగాణ స్టేట్ బ్రాంచ్ వారు పరిశీలించిన అనంతరం వాటిని ఓటరు జాబితాలో చేర్చడం ఈనెల 16వ తేదీన జరుగుతుందని పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితా ఈ నెల 19వ తేదీన ప్రకటించి, అదే రోజు ఎలక్షన్ నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24వ తేదీన నామినేషన్లు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వీకరించి, అభ్యర్థులు తమ నామినేషన్ చేసే క్రమంలో ఒక నామినేషన్ కు రూ. 10,000/- (నాన్ - రిఫండబుల్) నగదును డిపాజిట్ చేయాలని, ఈనెల 25వ తేదీ నామినేషన్లను పరిశీలించి, 26వ తేదీ మధ్యాహ్న ఒంటిగంట వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. వచ్చే నెల అక్టోబరు 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం నాలుగు గంటలకు కౌంటింగ్ ప్రారంభిస్తామని, కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఎన్నికల్లో విజేతల వివరాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గెలిచిన వారి జాబితా పూర్తి వివరాలను ఎన్నికలు నిర్వహించిన అధికారి జిల్లా కలెక్టర్ కు నివేదిక రూపంలో అందిస్తారని, ఈ నివేదికను అక్టోబర్ 5వ తేదీన స్టేట్ బ్రాంచ్ కు జిల్లా కలెక్టర్ అందజేయనున్నారు.

## ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం

### మాట్లాడుతున్న ఎంపీడీవో



నూతనకల్ సెప్టెంబర్ 11(జనంసాక్షి)

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సునీత మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు శాఖల వారీగా తమ నివేదికలను సమావేశం ముందు చదివి వినిపించాలని అధికారులను కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు చేయూత పెన్షన్లు విబిజి రామ్ జి పథకం కింద నీటి కుంట, బోర్ వెల్ రీఛార్జ్,ఇంకుడు గుంటలు పారిశుధ్య కార్యక్రమాలు ఇతర సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి,తహసిల్దార్ పి శ్రీనివాసరావు,ఎంపీఓ హరి సింగ్, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ విచారణను వేగవంతంగా పూర్తి చేయాలి

### అడిషనల్ కలెక్టర్ జై శ్రీనివాస్

హాలియా జనంసాక్షి సెప్టెంబర్ 11



అనుముల మండల పరిధిలోని ముక్కమల గ్రామంలో సర్ ప్రక్రియను విచారణశుక్రవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బి ఎల్ ఓ లకు సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. మండలంలోని సర్ పురోగతి గురించి తాసిల్దార్ చందర్రావును అడిగి తెలుసుకున్నారు. పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్

### ఉత్తర్వులు జారీ చేసిన జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్

రామన్నపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):



తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం ముత్యాల రమేష్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జేఏసీ చైర్మన్ తోగరి కరుణాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు జర్నలిస్టులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## సర్ ప్రక్రియను విచారణను వేగవంతంగా పూర్తి చేయాలి

### అడిషనల్ కలెక్టర్ జై శ్రీనివాస్

హాలియా జనం సాక్షి సెప్టెంబర్ 11

అనుముల మండల పరిధిలోని ముక్కమల గ్రామంలో సర్ ప్రక్రియను విచారణశు క్రవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిఎల్ఓ లకు సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. మండలంలోని సర్ పురోగతి గురించి తాసిల్దార్ చందర్రావును అడిగి తెలుసు కున్నారు. పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## గ్రామ అభివృద్ధికి సమష్టి కృషి



వలిగొండ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. వార్డు సభ్యులు తమ ప్రాంత సమస్యలు, అభివృద్ధి పనులను వివరించగా పంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్ నమోదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..శాంతిభద్రతలకు ప్రజల సహకారం కోరారు. అనంతరం ఎంపీడీవో, ఎస్ఐ, నూతన పంచాయతీ కార్యదర్శిని సర్పంచ్ సత్కరించారు.

## మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో మర్యాల విద్యార్థుల హవా

### ఖో-ఖో, కబడ్డీలో పలు విభాగాల్లో ప్రథమ స్థానం

బొమ్మలరామారం సెప్టెంబర్ 11 (జనంసాక్షి)



మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో మర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం మర్యాల జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికల్లో వివిధ పాఠశాలలకు చెందిన 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఖో-ఖో అండర్-17 బాలికలు, బాలురు, అండర్-14 బాలికలు, బాలురు విభాగాల్లో మర్యాల జట్లు ప్రథమ స్థానాలు సాధించాయి. కబడ్డీ అండర్-17, అండర్-14 బాలికల విభాగాల్లోనూ మర్యాల జట్లు విజేతలుగా నిలిచాయి. ద్వితీయ స్థానాల్లో జలాల్‌పూర్ జెడ్పీహెచ్ఎస్, ఐరిష్ పాఠశాల జట్లు నిలిచాయి. హెచ్ఎం పగిడిపల్లి నిర్మలా జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని సర్పంచ్ సంగి గణేష్ ప్రారంభించారు. ఎంఈవో రోజారాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం హెచ్ఎం నిర్మలా జ్యోతి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కోనేటి గోపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి :కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట (జనంసాక్షి):



జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు వేగంగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గ్రామీణ రెవెన్యూ సర్వేల నుంచి మొదలుకొని ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం వరకు ప్రతి అంశంలోనూ పారదర్శకత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను తగ్గించి, ప్రజలకు మేలైన సేవలు అందించడమే లక్ష్యంగా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లో రెవెన్యూ అధికారులతో భూభారతి, ప్రజావాణి దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా చేపడుతున్న గ్రామ సర్వే ప్రక్రియ ఇకపై మరింత సమర్థవంతంగా పని చేయాలని తెలిపారు. తహసీల్దార్లు, సర్వేయర్లు సమన్వయంతో ప్రతివారం పురోగతి నివేదికలు అందిస్తూ, సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ముందడుగు వేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించేందుకు అధునాతన ఏఐ, డిజిటల్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. గతంలో గంటల సమయం పట్టే నివేదికలు, డ్రాఫ్టింగ్ పనులను సాంకేతికత ద్వారా కేవలం కొన్ని నిమిషాల్లోనే నాణ్యతతో పూర్తి చేయవచ్చని వెల్లడించారు. దీనివల్ల అధికారుల పనిభారం తగ్గడమే కాకుండా, పౌరులకు వేగవంతంగా సేవలు అందుతాయన్నారు. మండలాల వారీగా దీర్ఘకాలంగా వేధిస్తున్న ప్రధాన భూసమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక జాబితా రూపొందించాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులతో పాటు 60 రోజులకు పైబడి పెండింగ్‌లో ఉన్న భూభారతి కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్,డిఆర్ఓ ప్రేమ్ రాజ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మలరామారం లో బోనమెత్తిన ఎమ్మెల్యే సతీమణి బీర్ల అనిత

**బొమ్మలరామారం సెప్టెంబర్ 11 (జనంసాక్షి )**
మండల కేంద్రంలోని శ్రీ జడల మైసమ్మ తల్లికి శుక్రవారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు.వడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బేతాళ శ్రీనివాసుల గాంధీ మాతృమూర్తి స్వర్గీయ బేతాళ మల్లమ్మ జ్ఞాపకార్థంగా ఆయన మనుమరాలు బేతాళ ఖ్యాతి. తాదూరి ద్రితి అనగా పేర్ల మీద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి బీర్ల అనిత ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరైనారు.ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు తీర్చిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో పాడి పంటలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఆమె తెలిపారు. గ్రామదేవతల ఆశీర్వాదంతో పాటు ఆలేరు ప్రజల ఆశీర్వాదం ఆలేరు ఎమ్మెల్యే పై ఎప్పుడు ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.ఆలేరు నియోజకవర్గ ప్రజల కోసం అనుక్షణం ఆలోచించే ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబం బాగుండాలనే తలంపుతో బేతాళ శ్రీనివాసులు గాంధీ స్వకార్యాన్ని స్వామి కార్యాన్ని నెరవేర్చినట్టు తన కుటుంబ కార్యక్రమంలో కూడా ఐలయ్య కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేసినందుకు మాజీ ఉపసర్పంచ్ సీనియర్ రిపోర్టర్ బేతాళ శ్రీనివాస్ కుటుంబం కూడా చల్లగా ఉండాలని ఈ సందర్భంగా ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్, సింగిల్ విండో చైర్మన్ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పడమటి పావని, కాంగ్రెస్ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు యాంజాల కళ, డిసిసి అధికార ప్రతినిధి తిరుమల కవిత, డిసిసి ప్రధాన కార్యదర్శి ధానవత్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు



రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఫకీరు సంగీతా, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఎడమ పుష్ప, సర్పంచులు యంజాల సరస్వతి, మాడావత్ తార, ధీరావత్ సునీత, సింగిల్ విండో డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, పలు గ్రామాల ఉపసర్పంచ్లు ,గ్రామ శాఖ అధ్యక్షుల తో పాటు జడల మైసమ్మ అన్నదాన నిర్వహణ కమిటీ సభ్యులు కుక్కదువు గణేష్, బండి మహేష్ గౌడ్ ,జూపల్లి భరత్ ,గుండోజి మోహన్,గ్రామ పెద్దలు కట్ట శ్రీకాంత్ గౌడ్ ,ఉప సర్పంచ్ ఎలబోయిన జంగయ్య ,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుదే బాలనరసింహా, మాజీ సర్పంచ్ రాంపల్లి మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

# స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ప్రారంభం

## క్రీడలతో మానసికోల్లాసం.. ప్రతిభకు పదును

**గుర్రంపోడు: సెప్టెంబర్ 11 (జనంసాక్షి)**



క్రీడలు విద్యార్థుల్లో మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి టి. శేఖర్ అన్నారు. శుక్రవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని పీఎం శ్రీ మోడల్ పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా టి. శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడలు యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడతాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నియోజకవర్గ, డివిజన్, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్. కరుణశ్రీ, మండల విద్యాధికారి నోముల యాదగిరి, స్థానిక సర్పంచ్ జాల యాదయ్య, పీఎం శ్రీ టీఎస్ఎంఎస్ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ స్వరూప్ రెడ్డి, పీడీలు నాగేశ్వరరావు, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పీఈటీలు శ్రీనివాస్ రెడ్డి, మారయ్య, గుంజ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మునిపంపుల హై స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

రామన్నపేట, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):
మండలంలోని మునిపంపుల హై స్కూల్ లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం, ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందే మాతరం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు తమకు విద్యనందించే ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల విలువైన సూచనలను ఆసక్తిగా విన్నారు. అదే విధంగా పాఠశాలకు 3 రోజులు సెలవులు రావడం తో పర్యావరణ హితమైన మట్టి వినాయకుణ్ణి విద్యార్థులే తయారు చేసి ముందస్తు వినాయక చవితిని ప్రారంభించారు. పాఠశాల హెచ్ ఎం దొడ్డి స్వామి విద్యార్థులను అభినందించి మాట్లాడారు గురువులు అందించే విలువలతో కూడిన విద్యను పొంది గొప్పగా ఎదగాలని, నైతిక విలువలు పెంపొందించుకోవాలని పర్యావరణంను పరిరక్షించుకోవాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వాలంటీర్ గాదె పారిజాత, పాఠశాల శ్రేయోభిలాషి మన్నె పద్మా రెడ్డి, ఏ ఏ పి సి చైర్మన్ బత్తిని వెంకటమ్మ, ఉపాధ్యాయులు తిరుమల రెడ్డి, వెంకటేశ్వర్లు. మనోహర్ , వసంత, ఎ. మంజుల, త్రివేణి ప్రసాద్ , జి. మంజుల, సరోజ, పాల్వంచ హరికిషన్, నాగలక్ష్మి , శ్రీశైలం, సునీత, ఆఫీస్ సిబ్బంది రాకేష్, జాకీర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలి

◆ మహిళా డిగ్రీ కళాశాల ప్రధానాచర్యులు కే. శ్రీనివాసరాజు

◆ రామన్నపేట డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి పోటీలు

**రామన్నపేట సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**




రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్, జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ అంశాలపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య కె. శ్రీనివాసరాజు విచ్చేసి ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, విద్యార్థులు చదువుతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ జిల్లా స్థాయిలోని వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలల నుండి విచ్చేసిన విద్యార్థులు కథా రచన,నినాదాల రచన, పోస్టర్ మేకింగ్, స్కిట్, రీల్ మేకింగ్, ఫోటోగ్రఫీ, క్విజ్, డిబేట్, పేపర్ క్రాఫ్ట్ వంటి అంశాలలో పాల్గొని ప్రతిభాపాటవాలను ప్రదర్శించారని, విద్యతో పాటు సాహిత్య, సాంస్కృతిక, క్రీడా పోటీల్లో రాణించినప్పుడే ఉన్నతమైన వ్యక్తిత్వ విలువలను పెంపొందించుకుంటారని అన్నారు. ప్రధానాచార్యులు సి. జగదీశ్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో పర్యావరణానికి ఎంతో ముప్పు కలిగిస్తున్న దేశాలు పర్యావరణాన్ని నాశనం చేయకుండా కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్నబాబు, జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ జి. సునీత, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్. రత్న మంజుల, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. లక్ష్మి నీలిమ, ఎన్సిసి అధికారి డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, రంగస్థల కళాకారుడు బాపనపల్లి వెంకటస్వామి కళాశాల అధ్యాపకులు, ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాడుతాం

సూర్యాపేట (జనంసాక్షి):
బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్ సీబీఈ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు అయితగాని మహేష్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా సూర్యాపేటలో బ్యాంకు ఉద్యోగులు నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని తెలిపారు.ప్రస్తుతం రెండు శనివారాలు సెలవులు ఉండగా, మిగిలిన రెండు శనివారాలను కూడా సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.కస్టమర్లకు బ్యాంకు సేవలు సాయంత్రం నాలుగు గంటలకే ముగిసినా, ఉద్యోగులు మాత్రం రాత్రి తొమ్మిది, పది గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని, తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు.ఐదు రోజుల పనిదినాలు అమలు చేసినా కస్టమర్లకు ఇబ్బంది కలగకుండా సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ అదనంగా 40 నిమిషాల పాటు సేవలు అందించేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.దీనిపై భారతీయ బ్యాంకుల సంఘంతో ఒప్పందం జరిగినప్పటికీ రెండున్నరేళ్లు దాటినా అమలు చేయకపోవడం




విచారకరమన్నారు.పనితీరు ఆధారిత ప్రోత్సాహకంలోనూ ఉద్యోగుల మధ్య వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.బ్యాంకుల లాభాల్లో ఉద్యోగుల శ్రమ కీలకమని, అందుకు అనుగుణంగా న్యాయమైన ప్రోత్సాహకం అందించాలని కోరారు.కింది స్థాయి ఉద్యోగులకు 15 రోజుల జీతం ప్రోత్సాహంగా , పైస్థాయి అధికారులకు 365 రోజుల జీతం ప్రోత్సాహంగా ఇవ్వడం సరికాదన్నారు.కేంద్ర ప్రభుత్వం బ్యాంకులను బలహీనపరిచి భవిష్యత్తులో ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.ఉద్యోగులను విభజించి పాలించే విధానాన్ని సహించబోమని స్పష్టం చేశారు.డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 28, 29, 30వ తేదీల్లో మూడు రోజుల సమ్మె నిర్వహిస్తామని తెలిపారు.అప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భాస్కర్, ఫణి, వంశీ, నీల శ్రీనివాస్, ఎస్ రామకృష్ణ, అలీం, శ్రీధర్, నరేష్, వెంకటేశ్వర్లు, వికాస్, సురేష్,నవీన్, కిషోర్, కృష్ణ హేమలత, ప్రియాంక, సౌజన్య, నాగిరెడ్డి, నందన్, ఉమ మహేష్, చిట్టిబాబు, పవన్ శర్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# వృత్తులన్నిటిలోకి ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

**తుర్కపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి)**
వృత్తులన్నింటిలోకి ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని ఎంఈఓ మంజుషారాణి అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జేఎం ఫంక్షన్ హాల్ లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కపల్లి మండలంలోని మండల స్థాయి, జిల్లాస్థాయి ,రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులు గా అవార్డులు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి మెరుగైన నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు, ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉషారాణి ,మమత, కళావతి ,సైదులు ,తిరుపతిరెడ్డి, శ్రీలక్ష్మి, రజియా సుల్తానా ,నవీన, సుజాత ,గాయత్రి, హరిత, భానుమతి, హసీనా బేగం ,జ్యోతి, శ్రీనివాసచారి ,అరుణ ,రామ్మోహన్, రమేష్ రెడ్డి ,వేదమని, షబానా, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా మాలతి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు బిక్కం సాహెబ్, వినోద రాణి, అరుణ, వెంకటరమణ, వేణుగోపాల్ రావు లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.